# వార్త

ఆదివారం

19 జనవరి, 2025



# పరీక్షలే భవిష్య రక్షలు



# ఎన్టీఆర్ కొత్త సినిమా డ్రాగన్!



ఎన్టీఆర్ అభిమానులను 'దేవర' కాస్త నిరాశపరిచిందనే చెప్పాలి. కొరటాల శివ దర్శకత్వం వహించిన ఈ సినిమా, భారీ వసూళ్లనే రాబట్టింది. అయితే కంటెంట్ విషయంలో అభిమానులకు పూర్తిస్థాయి సంతృప్తి కలగలేదని టాక్ వచ్చింది. అయితే, ప్రస్తుతం ఎన్టీఆర్, బాలీవుడ్ మూవీ 'వార్ 2'తో బిజీగా ఉన్నాడు. భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ సినిమాపై అదే స్థాయిలో అంచనాలు ఉన్నాయి. ఆగస్టులో ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ చేసే తెలుగు మూవీ కోసం ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ ఎలా ఉంటుందనేది 'కేజీఎఫ్' 'సలార్' సినిమాలు నిరూపించాయి. ఎన్టీఆర్‌కి ఒక రేంజ్‌లో మాస్ ఇమేజ్ ఉండటం వలన, వీరి కాంబినేషన్ సంచలనం సృష్టిస్తుందని అభిమానుల నమ్మకం. ఈ సినిమాకి 'డ్రాగన్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. మైత్రీ మూవీస్, ఎన్టీఆర్ ఆర్ట్స్ వారు సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకి సంబంధించిన సన్నాహాలు చకచకా జరిగిపోతున్నాయి. ఈ సినిమాలో ఇద్దరు కథానాయికలకు అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఒక కథానాయికగా రష్మిక, మరో కథానాయికగా రుక్మిణి వసంత్ కనిపించనున్నారని సమాచారం. సంగీత దర్శకుడిగా రవి బస్రూర్‌ను తీసుకున్నారని టాక్. త్వరలో ఈ సినిమా షూటింగ్ మొదలు కానుందని అంటున్నారు.

## తారాతీరం

టాలీవుడ్

# మరో మూవీకి విజయ్ దేవరకొండ ప్లాన్స్



సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న తాజా సినిమాల్లో టాలెంటెడ్ దర్శకుడు గౌతమ్ తిన్ననూరితో చేస్తున్న పాన్ ఇండియా సినిమా కూడా ఒకటి. ఇది విజయ్ కెరీర్‌లో 12వ సినిమాగా తెరకెక్కిస్తుండగా, పూర్తిగా మాస్ లెవెల్లో సాలిడ్ ఎమోషన్స్‌తో ఈ సినిమాని మేకర్స్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం కచ్చితంగా ప్రతీ ఒక్కరినీ ఆశ్చర్యపరుస్తుందని బలంగా టాక్ వినిపిస్తోంది. 'జెర్సీ' లాంటి సాఫ్ట్ సబ్జెక్టు తీసిన దర్శకుడు గౌతమ్ తిన్ననూరి నుంచైనా ఈ రేంజ్ సినిమా వచ్చింది.. అని అంతా ఆశ్చర్యపోయేలా ఉంటుందని అంచనాలు పెట్టుకున్నా కూడా వాటికిమించే దర్శకుడు ఈ సినిమాని తెరకెక్కి స్తున్నారని సమాచారం. దీనితో విజయ్ అభిమానుల్లో ఈ సినిమా పట్ల మరిన్ని అంచనాలు నెలకొన్నాయి.

ఆదివారం వార్త
19 జనవరి, 2025

## మంచి ముత్యాలు

మంచి సంపాదించడానికి సంవత్సరాలు పడుతుంది.

చెడ్డతనానికి సెకన్లు చాలు. ఇది ప్రపంచంలోనే చిత్రాతిచిత్రం.

## కదంబం


సంఘీ'భావం....5

తీర్పుల్లో జాప్యంతో

అందని న్యాయం

కవర్ స్టోరీ

పరీక్షలే

భవిష్య రక్షలు

గిరిజా కల్యాణం 11

ఈవారం కవిత్వం...12

దృశ్యం

పర్యాటకం ఎంతో పసందు 18

కథ..20

చదువు నేర్పిన సంస్కారం

సాహిత్యం...23

తెలుగు మాటకి గుడి..

గుప్తదానం 24

రాజభోగాల రైలు 28

ఇంకా...

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


# తాజా వార్తలు

## మొక్కల్ని పెంచేద్దామిలా..

ఎంతటి ఉద్యాన నిపుణులైనా ఇండోర్ ప్లాంట్స్ పెంచడానికి కాస్త భయపడుతుంటారు. వాటిని ఎంత జాగ్రత్తగా చూసినా ఏదో ఒక సందర్భంలో ఆకులు రాలిపోవడం, ఎండిపోవడం జరుగుతుంటుంది. ముఖ్యంగా వాటికి సరిపడా ఎండ తగలకపోవడంతో ఆహారాన్ని తయారు చేసుకోలేకపోవడం వల్లే అలా జరుగుతుంటుంది. అలాగని మాటిమాటికీ ఎండ తగిలే చోట పెట్టి మళ్లీ లోపల పెట్టలేరు కదా. పని సంగతలా ఉంచితే, కొన్ని రకాల క్రోటన్ మొక్కలకి ఎండ ఎక్కువైనా ఇబ్బందే. అందుకే ఇప్పుడు ఎల్ఇడి గ్రో లైట్స్ దొరుకుతున్నాయి. స్టాండులతో వస్తోన్న ఈ లైట్లను మొక్కలు ఉన్నచోట కాసేపు ఆన్ చేసి ఉంచితే, వాటికి సరిపడా కాంతి అందుతుంది. వీటిల్లో ఒక్కో కుండీకి పెట్టుకునే లైట్లూ ఉన్నాయి. 50, 60, 80..ఇలా రకరకాల వాట్స్ సామర్థ్యంతో వస్తోన్న ఈ లైట్లు రెడ్, బ్లూ, తెలుగు రంగు కాంతుల్ని వెదజల్లుతూ ఇంట్లోనూ మొక్కలు చక్కగా పెరిగేందుకు తోడ్పడుతున్నాయి.



## పోషకాల స్టిక్స్..

మనం టొమాటోలు కాయించాలని కుండిలో విత్తనాలు వేస్తే, మొక్కలొచ్చాయి. కొంచెం కొంచెం పెరుగుతున్నాయి. కొమ్మలు రెమ్మలు వేసి పువ్వులు పిందెలుగానూ మారాయి. కానీ ఆ పిందెలు కాయల్లా మారకుండానే రాలిపోతున్నాయి. అప్పుడు వాళ్లమ్మ కుండిలోని మట్టిలో బలం లేదు. అది చక్కగా కాయాలంటే కాస్త ఎరువూ వేయాలి అంటూ క్రేయాన్ లాంటి స్టిక్ తెచ్చి నేలలో పెట్టాలి. మొక్కకు అవసరమైన అన్ని రకాల పోషకాలతో తయారవుతోన్న ఈ స్టిక్స్‌ను మట్టిలో గుచ్చితే చాలు..నిశ్చింతగా ఉండొచ్చు. వీటిల్లో మళ్లీ రెండు రకాలుంటాయి. పచ్చదనం కోసం పెంచే ఇండోర్ ప్లాంట్స్‌కి గ్రీన్‌స్టిక్కూ, పువ్వులూ కూరగాయాలూ పండ్ల మొక్కల కోసం ఎరుపురంగులో ఉండే బ్లూమ్ స్టిక్కూ వస్తున్నాయి. అయితే చేతికి కాస్త కూడా మట్టి అంటకుండానే మొక్కలకు ఎరువు వేసేయొచ్చన్న మాట. వేస్తే రెండు, మూడు నెలల పాటు వాటివైపు చూడక్కర్లేదు. బిజీ షెడ్యూల్‌తో తీరిక లేక మొక్కల్ని సరిగ్గా పట్టించుకోలేనివాళ్లకీ, కొత్తగా వాటిని పెంచే వాళ్లకి వీటితో పని తేలికవుతుంది.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com







# అనాస సొగసులు

అనాసపండు..పైన
గరగరలాడితేనేం.. లోపలి
గుజ్జు అద్భుతం!
ఆ రుచీ, పరిమళాల గురించి
చెప్పడానికి మాటలు చాలవు.
అంత గరుకైన అనాసను ఎంత
సొగసుగా చిత్రిక పట్టారో,
ఎన్ని చిత్రాలు
చేశారో చూడండి!











## 'సంఘీ' భావం



# తీర్పుల్లో జాప్యంతో అందని న్యాయం

తమకు జరిగిన అన్యాయాన్ని కోర్టుల దృష్టికి తీసుకురావడం ద్వారా ఉపశమనం పొందాలని, తమను మోసం చేసిన వారికి తగిన శిక్ష పడాలని ప్రతిఒక్కరూ కోరుకుంటారు. అయితే మన దేశంలో కావల్సిన మేరకు న్యాయస్థానాలు, న్యాయమూర్తులు అందుబాటులో లేకపోవడంతో న్యాయం అనుకున్నంత త్వరగా లభించడం లేదు. న్యాయం సకాలంలో అందకపోవడం కూడా బాధితుడికి మరో అన్యాయం జరిగినట్లేనని ఆంగ్లంలో ఒక సామెత ఉంది. ప్రస్తుతం ప్రజలకు న్యాయస్థానాల నుంచి అందే ఊరట అంతంత మాత్రంగానే ఉంటోంది. క్రిమినల్ కేసుల్లో సైతం తీవ్ర జాప్యం జరుగుతోంది. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ బాధితులు తిరగాల్సి వస్తోంది. నీతిఅయోగ్ వ్యాఖ్యానించిన మేరకు ప్రస్తుతం దేశవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో ఉన్న కేసులు పూర్తి స్థాయిలో విచారణ చేసి తీర్పు వెల్లడించ డానికి కనీసం నాలుగు వందల సంవత్సరాలు పడుతుంది. దేశవ్యాప్తంగా సుమారు నాలుగున్నర కోట్లకుపైగా కేసులు వివిధ స్థాయిలో విచారణ దశలోనే ఉన్నాయి. ప్రస్తుతం అందిన గణాం కాల ప్రకారం, సుప్రీంకోర్టులో సుమారు 85 లక్షలు, హైకోర్టుల్లో 62 లక్షలు, కిందికోర్టుల్లో సుమారు మూడు కోట్లకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పది లక్షల మందికి కనీసం 50 మంది న్యాయమూర్తులు ఉండాలని నిబంధనలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం 20 మంది కూడా ఉండటం లేదు. ముఖ్యంగా సివిల్ కేసుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. కొన్ని కేసులు దశాబ్దాల తరబడి కొనసాగుతూనే ఉన్నాయి. వాయిదాల మీద వాయిదాలు పడుతున్నాయి. కొన్ని కోర్టుల్లో కేసుల సంఖ్య పెరిగిపోవడంతో మరో కోర్టుకు బదిలీ చేస్తున్నారు. అక్కడ కేసు దాదాపుగా మళ్లీ ముందునుంచి ప్రారంభం అవుతోంది. దీనితో మరి కొన్ని సంవత్సరాలు అదనంగా కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. సామాన్యులు కోర్టుగురించి వ్యాఖ్యానిస్తూ ఓడిపోయిన వాడు కోర్టులో ఏడిస్తే, గెలిచినవాడు ఇంటికి వచ్చి భోరున ఏడుస్తాడని అంటూ ఉంటారు. గెలిచిన వారికి తమకు అందిన న్యాయం కంటే సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరగడం, భారీ మొత్తంలో ఖర్చు చేసుకోవడం వంటివి పట్టి పీడిస్తాయి. హైదరాబాద్‌లో సుమారు 20సంవత్సరాల క్రితం ఒక కండక్టర్ తన విధి నిర్వహణ సమయంలో ఒక ప్రయాణికుడి నుంచి అదనంగా డబ్బు వసూలు చేశాడని కోర్టులో దావా దాఖలు అయ్యింది. కోర్టు సదరు కండక్టర్‌ను నిందితుడిగా పేర్కొనడంతో విధులనుంచి తాత్కాలికంగా పక్కన పెట్టింది. ఈ కేసు సుమారు 23 సంవత్సరాల పాటు కొనసాగింది. అప్పటికి కండక్టర్ వయస్సు 60 సంవత్సరాలు దాటింది. అప్పుడు వచ్చిన తీర్పుతో అతనికి తిరిగి ఉద్యోగంలో చేరే అవకాశం కోల్పోయాడు. అంతే కాకుండా అతను రెండు దశాబ్దాలు ఒక నిందితుడిగా అవమా నాన్ని భరించాడు. చిన్నచిన్న నేరాలు చేసి జైళ్లకు వెళ్లిన వారి సంఖ్య దేశవ్యాప్తంగా కోట్లలో ఉంటుంది. వీరికి బెయిల్ ఇచ్చేవారు, డిపాజిట్లు కట్టేవారు లేకపోవడంతో వీరు జైలులోనే మగ్గుతూ ఉంటారు. విచారణలు వాయిదాల పరంపర కొన సాగిన తరువాత అతనికి జైలుశిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువడుతుంది. అనేక సందర్భాల్లో అతనికి పడినశిక్ష కంటే అదనంగా జైలు జీవితాన్ని గడిపి ఉంటాడు. ఇక్కడ రెండు అంశాలు పరిశీలించాల్సి ఉంటుంది. ఒకటి దోషి తనకు పడిన శిక్ష కంటే అదనంగా జైలు జీవితాన్ని గడిపాడు. మరో అంశం జైలులో అతనికి అనవసరంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇలాంటి ఘటనలు ఎన్నో ఉంటాయి. కింది కోర్టులో జీవిత ఖైదు విధిస్తే అతను సుమారు పదేళ్ల జైలుజీవితం గడిపితే పై కోర్టు అతనిని నిర్దోషిగా విడుదల చేస్తుంది. దీనికి కారణంగా త్వరతగతిన తీర్పులు రాకపోవడం, ఇటీవల రాష్ట్రపతి ముర్ము కూడా న్యాయ స్థానాల్లో కొనసాగుతున్న విచారణ వాయిదా పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. మనదేశంలో ప్రతి పదిలక్షల మందికి 20మంది న్యాయమూర్తులు ఉంటే, అమెరికాలో 150మందికిపైగా న్యాయ మూర్తులు ఉన్నారు. దీనితో అక్కడ త్వరగా విచారణ పూర్తయి తీర్పులు వెలువడుతుంటాయి. ఈ విధంగా తీర్పులు త్వరగా వస్తే నేరాలు చేసే వారిలో కొంత భయం కలుగుతుంది. న్యాయస్థానాలకు ఆదివారాలు సహా ఏడాదిలో కోర్టులకు సుమారు వంద రోజులకుపైగా సెలవులుంటాయి. ఇవికాకుండా మరో 20 నుంచి 30 రోజులు ఇతర సెలవులు వర్తిసాయి. రాష్ట్రవ్యాప్తంగా మంజూరైన న్యాయమూర్తుల పోస్టులో సుమారు ఆరు వేల వరకు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. దీనితో కొన్నికోర్టుల్లో న్యాయమూర్తులు రెండు,మూడు కోర్టులకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. దీనితో న్యాయమూర్తులపై ఒత్తిడి పెరుగుతుంది. తీర్పు ఇచ్చే సమయంలో ఒత్తిడి లేకపోతేనే సరైన న్యాయం బాధితులకు అందుతుంది. త్వరగా దావాను పరిష్కరించే ప్రయత్నం జరిగితే కొన్ని సందర్భాల్లో ప్రతికూల పరిస్థితులను కల్పించినట్లు అవుతుంది. న్యాయవ్యవస్థలో పరిపాలనా వ్యవహారాలకు సంబంధించి సత్వర నిర్ణయాలు తీసుకోవడానికి కమిటీలను ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. న్యాయమూర్తులు, సిబ్బంది ఖాళీలను త్వరగా భర్తీ చేయాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో తీర్పు వెలువడినా ఆ ఉత్తర్వులు బయటకు రావడానికి కొన్ని సందర్భాల్లో వారం, పది రోజులు పడుతుంది. ముఖ్యంగా జైల్లో ఉన్నా బెయిల్ మంజూరు అయినా కోర్టు నుంచి ఉత్తర్వులు జైలు అధికారులకు అందడానికి రెండు, మూడు రోజులు పడుతుంది. ప్రభుత్వాలు న్యాయవ్యవస్థకు ప్రాధాన్యత కల్పించి తీర్పులు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ**



# పరీక్షలే భవిష్య రక్షలు

కవర్ స్టోరీ

సుంకవల్లి సత్తిరాజు

**విద్యను గుప్త ధనంగా, విద్యను గురువుగా, దైవంగా భావించాలని, విద్య వలన గౌరవం పెరుగుతుందని భర్తృహరి తన సుభాషితాల్లో విద్య ఆవశ్యకత గురించి, విద్య గొప్పదనాన్ని గురించి సవివరంగా పేర్కొనడమే కాకుండా విద్య లేని వ్యక్తిని వింత పశువుగా వర్ణించడం జరిగింది. ఎంతో మంది కవులు విద్య యొక్క ప్రాశస్త్యాన్ని వివరిస్తూ తమ పద్యాల ద్వారా సమాజాన్ని మేల్కొలపడానికి ప్రయత్నించారు.**

విద్య వలన దేశం అభివృద్ధి చెందుతుంది. విద్య లేని సమాజం అంధకారబంధురంగా మారుతుంది. ఇనుమును అగ్నిలో కాల్చితేనే ఆయుధంగా మార్చగలం. బంగారాన్ని కరిగించి ఆభరణంగా మార్చాలంటే నిప్పులో కాలాలి. బంగారు పళ్ళానికైనా గోడ ఆసరా కావాలి. అలాగే మనలో ఎన్ని తెలివితేటలున్నా, వాటిని వెలికి తీసి, బహిర్గతం చేసి, సక్రమంగా వినియోగిస్తేనే సమాజానికి ఉపయోగం. ఇనుమునైనా, మనిషి మెదడునైనా వినియోగించకపోతే నిరుపయోగంగా మారక తప్పదు. ఇనుముకు తుప్పు పట్టినట్లు, ఆలోచనలు జ్వలించని మనిషి మెదడు నిర్వీర్యంగా మారక తప్పదు. అజ్ఞానంలో మునిగి తేలితే అంధకారం వ్యాపిస్తుంది. జ్ఞాన జ్వాలలో ఓలలాడితేనే మస్తిష్కం ఒక అమృత భాండాగారమవుతుంది. జ్ఞానం అనంతమైనది. అనంతమైన జ్ఞానసాగరాన్ని మధించి కొంతైనా మన మస్తిష్కాన్ని సానబెట్టాలి. అనంతమైన జ్ఞానం కేవలం ఒక అక్షరంతోనే ఆరంభమవుతుంది. అక్షరాలు పదాలుగా, పదాలు వాక్యాలుగా, వాక్యాలు పాఠాలుగా, పుస్తకాలుగా రూపాంతరం చెంది జ్ఞానానికి సోపానాలుగా మారతాయి. పుస్తకం మస్తకాన్ని చైతన్యవంతం చేసే ఆయుధం. ఆలోచనలను రగిలించి, పరిశీలనాత్మక దృక్పథాన్ని పెంపొందించి సమాజాభివృద్ధికి ఉపకరించే ఏకైక సాధనం విద్య. అలాంటి విద్యను నిర్లక్ష్యం చేస్తే, అభివద్ధికి ప్రజలను దూరం చేస్తే జన జీవితాలు అతలాకుతలమైపోతాయి. అజ్ఞానం ప్రబలి, అస్తవ్యస్థ అయోమయ పరిస్థితులు దాపురిస్తాయని చెప్పడానికి అనేక ఉదాహరణలున్నాయి. విద్యను ప్రజలకు దూరం చేసిన దేశాల పరిస్థితులు ఎలాఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

## పరీక్షలు భవితకు సూచికలు

జీవితంలో అనేక పరీక్షలు ఎదురవుతుంటాయి. ఎన్నో ఆటుపోట్లు, అవాంతరాలను ఎదుర్కొంటూ ముందుకు సాగడమే మన లక్ష్యం కావాలి. పాత సంవత్సరం కలలా వచ్చి కరిగిపోయి, కాల గర్భంలో కలసి పోయింది. కొత్త సంవత్సరం కోటి ఆశలతో అరుదెంచింది. జీవితమంటేనే ఒక పరీక్ష. బాల్యమొక పరీక్ష. యుక్తదశ మరొక పరీక్ష. విద్యార్థులకు ఉద్యోగాలు దొరికే వరకు అడుగడుగునా పరీక్షలే. ముఖ్యంగా 10 తరగతి నుండి ఇంటర్, డిగ్రీ, పి.జి స్థాయి వరకు పరీక్షలే పరీక్షలు. ఇంజినీ రింగ్, మెడికల్ కోర్సుల్లో ప్రవేశం నుండి చదువులు పూర్తయ్యే వరకు నిరంతరం పరీక్షలతో కాలం గడపక తప్పదు. 10వ తరగతి విద్యార్థి జీవితంలో ఎదుర్కొనే అసలు సిసలైన మొదటి పరీక్ష. ఈ మొదటి పరీక్షను సమర్థంగా ఎదుర్కొంటే ఆ తర్వాత వివిధ దశల్లో నిర్వ హించే పరీక్షలు రాయడానికి తగినంత ఆత్మ విశ్వాసం లభిస్తుంది. ఆత్మ విశ్వాసం విద్యార్థికి కొండంత అండ. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల శిక్షణతో పాటు ఏదైనా సాధించగలమన్న విశ్వాసం విద్యార్థుల మనసులను తాకాలి. వారి మస్తిష్కాల్లో కెరియర్ పట్ల ఆలోచనలు రగిలించాలి. భయంలేని వాతావరణంలో, విజేతల స్ఫూర్తి దాయకమైనమాటల్లో, నిలకడ గల మనస్తత్వాలతో, ఏకాగ్రతతో, దీక్ష, పట్టుదలతో విద్యార్థులు రాబోయే పరీక్షకాలాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలి. వచ్చే మార్చి నెలలో 10వతరగతి వార్షిక పరీక్షలు జరుగుతున్నాయి. విద్యార్థి దశలో 10వ తరగతి చాలా కీలకమైనది. ఇలాంటి కీలకమైన 10వ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడం ఒక ఎత్తయితే, మంచి మార్కులతో, గ్రేడులతో ప్రతిభకనబరచి, ఉత్తమ విద్యార్థులుగా రాణించడం మరోఎత్తు. 10వ తరగతిలో చూపిన ప్రతిభ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతగానో ఉపకరిస్తుంది. ఉన్నత విద్యలు అభ్యసించినా, ఉద్యోగాలకు సంబంధించిన విషయాల్లో 10వ తరగతిలో ప్రదర్శించిన ప్రతిభను కొలమానంగా తీసుకోవడం వాస్తవం. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమమైన ప్రతిభ కనబరచి, భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలి. పదవ తరగతి పరీక్షల విధానంలో గతంతో పోల్చి చూస్తే అనేక

## విద్యార్థులను తీవ్రంగా వేధిస్తున్న సమస్య

## "పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారం"

అహోరాత్రులు ఎంతో కష్టపడి పరీక్షలకు సంసిద్ధమైన విద్యార్థులకు పరీక్షా పత్రాల లీకేజీ మనోవ్యాకులతకు గురిచేస్తున్నది. పదవ తరగతికి సంబంధించిన పరీక్షా పత్రాలు ముందుగానే వాట్సప్ గ్రూపుల్లో ప్రత్యక్షం కావడం అప్పట్లో కలకలం సృష్టించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గతంలో ఎంసెట్ పేపర్లు లీకైన ఉదంతాలున్నాయి. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఇంటర్ ప్రశ్నాపత్రాల లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ అప్పటి ఉన్నత విద్యాశాఖా మంత్రి జి.ఎం.సి బాలయోగి తన పదవికి రాజీనామా చేసిన విషయం పాఠకులకు గుర్తుండే ఉంటుంది. **1996**లో ఉమ్మడి రాష్ట్రంలో ఎంసెట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం తీవ్ర దుమారం రేపింది. ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపి, మంచి ర్యాంకుల కోసం తీవ్రంగా శ్రమిస్తే తీరా పరీక్షలు వ్రాసే సమయంలోను, పరీక్షలు రాసిన తర్వాత ప్రశ్నాపత్రాలు లీకైనట్లు తెలిస్తే, పరీక్షల కోసం శ్రమించిన విద్యార్థుల మానసిక స్థితి ఎంత ఉద్విగ్న భరితంగా ఉంటుందో చెప్పనవసరం లేదు. అలాగే ప్రతిభ గల విద్యార్థుల మార్కులు తగ్గిపోవడం, ఏమీ చదవని విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించడం జవాబు పత్రాల మూల్యాంకనంలో జరుగుతున్న తప్పిదాలను తేటతెల్లం చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులను చక్కదిద్దాలి. పేపర్ వాల్యుయేషన్ ప్రక్రియను తూతూ మంత్రంగా ముగించరాదు. పరీక్షా ఫలితాలను తొందరగా వెల్లడించడానికి పడే తాపత్రయంలో కొంతైనా విద్యార్థుల భవిష్యత్తు పట్ల చూపాలి. జవాబు పత్రాల మూల్యాంకనం హడావిడిగా జరగరాదు. పేపర్ వాల్యుయేషన్ విషయంలో ఆచి తూచి వ్యవహరించాలి. పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడకుండా ప్రభుత్వాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తగిన బాధ్యత తీసుకోవాలి. ఇంటర్ పరీక్షా పత్రాల మూల్యాంకనంలో జరిగిన పొరపాట్ల వలన **2019** వ సంవత్సరంలో తెలంగాణలో అనేక మంది ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడడం ఎంతో మందిని బాధించింది. లక్షలాది మంది విద్యార్థులు నాటి జవాబు పత్రాల మూల్యాంకనంలో జరిగిన తప్పిదాలకు బాధితులైనారు. ఇలాంటి సంఘటనలు ఎక్కడ జరిగినా ప్రభుత్వాలు తక్షణమే స్పందించి అలాంటి తప్పులు పునరావృతం కాకుండా చూడాలి.






మార్పులు సంభవించాయి. గతంలో లాంగ్వేజ్ సబ్జెక్టుల్లో 80 నుంచి 90 మార్కులు రావడం చాలా అరుదుగా జరిగేది. భాషా దోషాలతో పాటు, వ్యాకరణ అంశాల్లో విద్యార్థులు చేసిన చిన్నచిన్న తప్పిదాలకు పరీక్షల్లో భారీ మూల్యం చెల్లించవలసి వచ్చేది. నేటి కాలంలో లాంగ్వేజ్ సబ్జెక్టుల్లో కూడా నూటికి నూరు శాతం మార్కులు వేయడం జరుగుతున్నది. భాష, భాషేతర అంశాల్లో కూడా గరిష్ఠ మార్కులను సాధించడం మనం చూస్తున్నాం. 10వ తరగతి పరీక్షలు జరిగిన తర్వాత కోడింగ్ ప్రక్రియను పూర్తి చేసి, జవాబు పత్రాలను మూల్యాంకనం చేయడం శరవేగంతో జరుగుతున్నది. పరీక్షలు రాసిన కొద్ది రోజులకే ఫలితాలు వెల్లడికావడం వలన ఇంటర్‌లో ఏఏ గ్రూపులు తీసుకోవాలో ఆలోచించి, నిర్ణయం తీసుకోవడానికి తగిన సమయం లభిస్తుంది. పాలిటెక్నిక్ వంటి ప్రవేశ పరీక్షలు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏప్రిల్-మే నెలల మధ్య కాలంలో జరుగుతాయి. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు శిక్షణ పొందడానికి కూడా తగిన సమయం లభిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో జరిగే ప్రవేశ పరీక్షలకు వచ్చే ఏప్రిల్ నెలలో పరీక్షలు జరుగుతాయి. ఎం.పి.సి, బై.పి.సి, ఎం.ఇ.సి, సి.ఇ.సి వంటి కోర్సులతో ఇంటర్‌లో ప్రవేశించడానికి వీలు కల్పిస్తున్నది. తెలంగాణాలో కూడా రెసిడెన్సియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి ప్రవేశ పరీక్షలు జరుగుతాయి. శ్రద్ధాశక్తులతో చదివి రెసిడెన్షియల్ కళాశాలల్లో ప్రవేశం పొందగలగాలి.

### విద్యార్థి దశ చదువులకు ఆలవాలం

బాల్యం చదువులకు, ఆటపాటలకు ఆలవాలం కావాలి. పాఠశాలలు ఆధునిక దేవాలయాలు. బడి బాలల విద్యావికాసానికి, మానసిక వికాసానికి నెలవు కావాలి. పాఠశాల విద్య ముగిసిన తర్వాత చాలామంది వివిధ కారణాల వలన పై చదువులకు దూరమవుతున్నారు. కొంతమంది 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యలో కృతకృత్యులు కాలేక ఉన్నత విద్యలకు నోచుకోవడం లేదు. పోటీ పరీక్షల్లో విఫలమై చదువులకు స్వస్తి చెబుతూ, బ్రతుకు దెరువు కోసం రోడ్డున పడుతున్న యువతను చూస్తున్నాం. నిద్రించకండి మేల్కొనండి జీవిత పరమార్థాన్ని గ్రహించి, విద్యలతో వికసించి, దేశాన్ని సుసంపన్నం చేయండని స్వామి వివేకానంద యువతకిచ్చిన సందేశం మరవరాదు. యువశక్తి దేశానికి ఇంధనం. అలాంటి యువత చదువుల్లో రాణించాలి. బాల్యం సక్రమంగా ఉంటేనే, యుక్త వయసు కూడా సజావుగా సాగుతుంది. బాల్యం నుండే చదువు పట్ల ఆసక్తి కలిగించాలి. చదువు సమస్త జగతి ప్రగతికి ఆధారమని గ్రహించాలి. వర్తమాన ప్రపంచం ఒక కుగ్రామంగా మారిపోయింది. సాంకేతిక పరిజ్ఞాన ప్రభావంతో చదువుల్లో కూడా పలు విప్లవాత్మక మార్పులు సంభవించాయి. చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు

లభించాలంటే, ఉన్నత విద్యా ప్రమాణాలు గల చదువులు అందుబాటులోకి రావాలి. 10వ తరగతి స్థాయిలోను, ఆ తర్వాత స్థాయిలోను విద్యార్థులు చక్కని అవగాహనతో పరీక్షలను ఎదుర్కొనాలి. పోటీ పరీక్షల్లో విజయం సాధించ దానికి తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలి. విద్యార్థులు తమ కెరియర్ పట్ల అత్యంత జాగరూకత వహించాలి. ఒక చిన్న రంధ్రం పెద్ద నావను ముంచేసినట్లు భవిష్యత్తు పట్ల అవగాహన, బాధ్యత లేకుండా పరీక్షల పట్ల నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుంది. కాబట్టి విద్యార్థుల తగిన కార్యాచరణ ప్రణాళికతో రాబోయే పరీక్షలను సునాయాసంగా ఎదుర్కొని విజయం సాధించవచ్చు.

## సమాజాన్ని నడిపించేది..నడవడిక నేర్పించేది..

అనుక్షణం మనల్ని కాపాడుతూ, బతుకుదెరువుకు మార్గం చూపించి, మనిషిగా తీర్చిదిద్ది, సమాజంలో మనకు గౌరవమైన స్థానం కల్పించేది కేవలం విద్య మాత్రమే. జ్ఞానం అనంతమైనది. అనంతమైన జ్ఞాన సాగరాన్ని అక్షరమనే ఆయుధంతో మధించి, చదువు అనే కవ్వంతో చిలకరించి, జ్ఞానామృతాన్ని ఆస్వాదించాలి. విద్య వలన వ్యక్తిత్వం వికసిస్తుంది. మానవ సమాజం ఒడిదుడుకులు లేకుండా సజావుగా ముందుకు సాగుతుంది. ఎక్కడైతే నిజమైన విద్యతో యువత రాణిస్తుందో, అక్కడ అభివృద్ధి మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతుంది. కోవిడ్ వలన ప్రపంచ వ్యాప్తంగా రెండు సంవత్సరాల పాటు విద్యా వ్యవస్థలు అతలాకుతలమై పోయాయి. పరీక్షలు జరపకుండానే విద్యార్థులను ఉత్తీర్ణులుగా ప్రకటించడం జరిగింది. పలువురు విద్యార్థుల చదువులపై కోవిడ్ తన పంజా విసిరింది. విద్యావ్యవస్థలు గాడిలో పడడానికి చాలా సమయం పట్టింది. కోవిడ్ సమయం లోనే ఆన్‌లైన్ క్లాసులకు బీజం పడింది. విద్యార్థులు విద్యకు దూరమైతే ఎంత ప్రమాదమో కోవిడ్ సంక్షోభం నిరూపించింది. కోవిడ్ గండం దాటిందని సంతోషించేలోగా పలు దేశాలు రష్యా-ఉక్రెయిన్ యుద్ధ ప్రభావంతో తీవ్రమైన ఆర్థిక మాంద్యానికి గురైనాయి.







విద్యార్థులు చదువుకు దూరమై, తిండి లేక అలమటిస్తున్న పరిస్థితులు దాపురించాయి. ఆఫ్గనిస్తాన్, పాకిస్థాన్, శ్రీలంక వంటి దేశాల్లో విద్యార్థుల చదువుకు తీవ్రమైన ఆటంకం ఏర్పడింది. ఇదిలాఉండగా కొన్ని దేశాల్లో జననాలు తగ్గిపోయాయి. ప్రజల ఆయుః ప్రమాణం పెరిగింది. దీని వలన కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యాయి. బాలలు, యువకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. చదువుకునే వారు లేక పలు దేశాల్లోని విద్యాలయాలు వెలవెలబోతున్నాయి. జపాన్, ఇటలీ, జర్మనీ, ఫిన్లాండ్ వంటి దేశాల్లో 65 సంవత్సరాలు దాటిన వృద్ధుల సంఖ్య అధికంగా ఉంది. స్పెయిన్, ఫ్రాన్స్, స్వీడన్ దేశాల్లో వృద్ధుల సంఖ్య ఆ దేశాల జనాభాలో సుమారు 4 వంతుగా ఉంది. మొనాకో, జపాన్, పోర్చుగల్, బల్గేరియా వంటి దేశాలు ప్రపంచంలో వృద్ధుల శాతం అధికంగా ఉన్న గల దేశాలుగా పరిగణింపబడుతు న్నాయి. చైనా వన్ చైల్డ్ విధానానికి స్వస్తి చెప్పినా అక్కడ జననాల రేటు పెరగడం లేదు. వృద్ధుల సంఖ్య విపరీతంగా ఉంది. యువ జనాభా తగ్గడంతో భవిష్యత్తులో చైనా అనేక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. చైనాలో అనేక విద్యాసంస్థలు మూతబడుతున్నాయి. జననాల రేటు గణనీయంగా తగ్గడం వలన విద్యాపరంగా చైనా అనేక ఒడుదుడుకులకు లోనవుతున్నది. వేలాది సంఖ్యలో ప్రాథమిక పాఠశాలలు మూతబడ్డాయి. భావితరాలు కనుమరుగైతే ఏ దేశమైనా మనుగడ సాగించలేదు. భవిష్యత్ తరాలకు విద్యను అందించక పోతే అభివృద్ధి శూన్యం. బాలల చదువు భవితకు వెలుగు. యుక్త వయసు వచ్చిన తర్వాత చదువుకు స్వస్తి చెప్పి, బ్రతుకు దెరువుకు వివిధ మార్గాలు చూసుకోవడం వలన యువత విద్యాపరంగా వెనకంజ వేస్తున్నది. యువశక్తి విద్యతో వికసించాలి. విద్యా సంపన్నమైన యువత వలన దేశాభివృద్ధి సుసాధ్యమవుతుంది. గతంలో కంటే ప్రపంచంలోనూ, భారత్ లోనూ అక్షరాస్యత గణనీయంగా పెరిగింది. చదువుకుని, సంతకం చేస్తే అదే అక్షరాస్యతగా భావించే రోజులుపోయాయి. ఉన్నతమైన చదువులు చదివి, ప్రపంచ పోకడలను అర్థం

చేసుకుని, సాంకేతిక పరిజ్ఞానం సంపాదించి, ఉపాధి అవకాశాలు కల్పించుకుని, తమ జీవితాలను మెరుగ్గా మలచుకునే సామర్థ్యం కలిగి ఉండడమే నిజమైన అక్షరాస్యతగా భావించాలి. అదే నిజమైన చదువుకు నిర్వచనం.

## పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి?

టెక్నాలజీ విస్తృతంగా వ్యాపించిన నేటి రోజుల్లో ప్రతీ విద్యార్థికి బాల్యం నుండే సాంకేతిక రంగం పట్ల అవగాహన కలిగించాలి. సాంకేతికతను అభివృద్ధికి ఆలంభనగా మార్చాలి. ప్రతిభకు పట్టం గట్టాలి. విద్యార్థులను ప్రతిభావంతంగా తీర్చిదిద్దాలి. సాంకేతిక మాధ్యమాల విష ప్రభావం విద్యార్థుల జీవితాలను నాశనం చేయకుండా కాపాడాలి. సుశిక్షితులైన, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులచే విద్యాలయాలను సమున్నతంగా తీర్చిదిద్దాలి. అన్ని స్థాయిల్లోను ఉన్నతమైన నాణ్యతా ప్రమాణాలు గల విద్యను బోధించాలి. దేశంలోను, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోను అనేక ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలున్నాయి. ఎక్కడ చదివినా విద్యార్థులు చక్కని ప్రతిభతో, నైపుణ్యతతో తమ భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దుకోవాలి. విద్యార్థుల ప్రతిభకు నేటి పరీక్షలు పెద్ద పరీక్షగా మారిన నేపథ్యంలో ఒత్తిడి లేకుండా పరీక్షలకు తర్ఫీదు కావాలి. విద్యార్థుల జీవితంలో పరీక్షలు ఒక భాగం కాబట్టి, 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు విద్యార్థులకు కీలకం కాబట్టి, వచ్చే మార్చి నెలలో ప్రారంభమయ్యే ఈ కీలకమైన పరీక్షలకు విద్యార్థులు ఇప్పటి నుంచే సంసిద్ధం కావాలి. టెన్త్, ఇంటర్ తర్వాత విద్యార్థులు ఉన్నతమైన విద్యాసంస్థల్లో ప్రవేశించడానికి అనేక పోటీ పరీక్షల్లో విజయం సాధించాలి. ఇంజినీరింగ్, వైద్య కోర్సులు పట్ల ఆసక్తి చూపించే యువ విద్యార్థులు కాలపట్టికను తయారు చేసుకుని క్రమశిక్షణతో, పట్టుదలతో తత్సంబంధిత పరీక్షలకు ఒక క్రమపద్ధతిలో సంసిద్ధం కావాలి. పరీక్షల సమయంలో నిద్రలేని రాత్రులు గడుపుతూ, అనవసరమైన ఒత్తిళ్ళకు గురవుతూ, అర్థంకాని పాఠ్యాంశాల కంఠస్థంతో మస్తిష్కాన్ని మొద్దుబార్చుకోవడం కంటే ఇప్పటి నుండే పరీక్షల కోసం తయారు కావాలి. పరీక్షల సమయంలో హడావిడిగా చదువుకోవడం కంటే పరీక్షలకు కొద్ది నెలల ముందే ఆహ్లాదకరమైన వాతావరణంలో, మానసిక ప్రశాంతతతో చదువుకుని, పరీక్షల్లో విజయం సాధించి, మంచి మార్కులు, గ్రేడులు సంపాదించడానికి ధృడసంకల్పంతో ప్రయత్నించాలి. నిద్రలేకుండా రాత్రంతా మేల్కొని చదవడం సరైన పద్ధతి కాదు. తగినంత విశ్రాంతి తీసుకుని, సరైన పౌష్టికాహారం స్వీకరిస్తూ, అలసటకు తావు లేకుండా ప్రణాళికా బద్ధంగా చదువుకోవడం వలన విద్యార్థులను ఒత్తిడికి దూరంగా ఉంచవచ్చు. అర్థంకాని పాఠ్యాంశాలను కూడా బట్టీ పట్టి పరీక్షలను, చదువులను గుదిబండగా భావిస్తూ, ఏదో విధంగా పరీక్షల భారం నుండి బయటపడాలను కోవడం వలన భవిష్యత్తులో విద్యార్థులకు అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. ఎం.సెట్ లాంటి రాష్ట్ర స్థాయి పరీక్షలను, నీట్ లాంటి జాతీయ స్థాయి పరీక్షలను ఎదుర్కోవడం బట్టీ విధానం వలన సాధ్యం కాదు. పాఠ్యాంశాల పఠనంతో పాటు, విద్యార్థులకు సృజనాత్మకత, ఆలోచన, పరిశీలనా దృక్పథం అవసరం. చదివిన పాఠ్యాంశాల సారాంశాన్ని గ్రహించి,కీలకమైన అంశాలను గుర్తుపెట్టుకుంటే, పరీక్షల్లో ఎదురయ్యే ప్రశ్నలకు సునాయాసంగా సమాధానాలు రాయవచ్చు. ఒకప్పుడు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయి, అక్కడ ప్రవేశ పరీక్షలు రాసి, ఆయారాష్ట్రాల ఇంజినీరింగ్, వైద్య కళాశాలల్లో చదువుకునేవారు. భారీ మొత్తంలో తెలుగు విద్యార్థులు ఫీజులు చెల్లించి, ఆయా రాష్ట్రాల్లోని ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలలకు ఆదాయ వనరుగా మారడం చూసి, తెలుగు విద్యార్థుల కోసం అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఉమ్మడి రాష్ట్రంలో ఎం.సెట్ ప్రవేశ పరీక్షను ప్రవేశ పెట్టడం జరిగింది. ఇంజినీరింగ్, అగ్రికల్చరల్ అండ్ మెడికల్ కామన్ ఎంట్రన్స్ టెస్టుగా పిలవబడే "ఎం.సెట్" ఆంధ్రప్రదేశ్ విభజనతో క్రమేపీ ఇంజినీరింగ్, అగ్రికల్చరల్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌గా ఈఏపి ఎంట్రన్స్ పరీక్షల పేరుతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు విడివిడిగా తమ విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. తెలంగాణా ఎం.సెట్ పేరును ప్రస్తుతం టిజి ఈఏపి సెట్‌గా పిలుస్తున్నారు. గతంలో మెడికల్ కోర్సులను ఎం.సెట్ ప్రవేశ పరీక్షతో భర్తీ చేసేవారు. అయితే భారతదేశంలోని వైద్య విద్యార్థులను నాణ్యమైన ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 2013 సంవత్సరం నుండి జాతీయ స్థాయిలో "నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్"ను ఎం.బి.బి.ఎస్, బి.డి.ఎస్ విద్యార్థుల కోసం నిర్వహించడం జరుగుతున్నది. నీట్‌లో విజయం సాధించి, మెడికల్ కోర్సుల్లో ప్రవేశించడం అంత సులభమైన పని కాదు. నిరంతర శ్రమ, పట్టుదల, అత్యుత్తమమైన కోచింగ్ వలన మాత్రమే జాతీయ స్థాయి నీట్‌లో విజేతగా నిలబడి, మెడికల్ కోర్సుల్లో ప్రవేశం సంపాదించవచ్చు. గతంలో వివిధ రాష్ట్రాలు, విద్యాసంస్థలు స్వతంత్రంగా నిర్వహించుకునే ఎం.బి.బి.ఎస్, బి.డి.ఎస్ ప్రవేశాలు రద్దు కాబడిన విషయం విదితమే. "నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ" ద్వారా నిర్వహించే నీట్ పరీక్ష ప్రతీ సంవత్సరం మే నెలలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. జాతీయ స్థాయిలో జరిగే జె.ఇ.ఇ, నీట్ పరీక్షలు విశేష ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఉత్తమ నాణ్యతా ప్రమాణాలకు మన దేశంలోని ఐ.ఐ.టి ఎన్.ఐ.టిలను ప్రామాణికంగా భావిస్తున్న నేపథ్యంలో ఈ సంస్థల్లో ఇంజినీరింగ్ చదవడానికి ఆశపడే విద్యార్థుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఈ పరీక్షలు జె.ఇ.ఇ మెయిన్,జె.ఇ.ఇ అడ్వాన్స్ పేరుతో రెండు దశల్లో జరుగుతున్నాయి. అలాగే ఇటీవలి కాలంలో చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో 'నీట్'లో కూడా పలు సవరణలు చోటు చేసుకుంటున్నాయి. డాక్టర్లు కావాలనుకునే విద్యార్థినీ విద్యార్థులు నీట్ ప్రవేశ పరీక్షపై తగిన అవగాహన పెంచుకోవాలి. ఎన్.టి.ఏ ఇకపై ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల ప్రవేశానికి సంబంధించిన విషయాల వరకే పరిమితమవుతుంది. ఎన్టిఏ ఉద్యోగ నియామకాల బాధ్యత



నుండి తప్పుకోబోతున్నది. నీట్ పరీక్ష పత్రాలు లీక్ కావడం, నీట్ ప్రవేశ పరీక్ష వ్యవహారం గందరగోళంగా మారడంతో నీట్ పరీక్షల నిర్వహణలోను, ఎన్‌టీఏలోను అనేక విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. దేశవ్యాప్తంగా 23 ఐఐటిలు, 31 ఐఎన్ఐటిలున్నాయి. మద్రాస్ఐఐటి, బెంగళూరు, బాంబే, ఐఐటి ఢిల్లీ, కాన్పూర్, ఖర్గపూర్, గౌహతి, ఇండోర్ వంటి ఐఐటిలు ప్రాచుర్యంలో ఉన్నాయి. తిరుచ్చి, సూరత్ కల్, రూర్కెలా, వరంగల్, దుర్గాపూర్,అలహాబాద్, కాలికట్, జైపూర్ వంటి ఎన్ఐటిలు దేశ వ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచాయి. ఐఐటి, ఎన్ఐటి లు భారతీయ ఇంజినీరింగ్ ఖ్యాతికి దర్పణం పడుతున్నాయి. వీటిలో ప్రవేశానికి లక్షలాది మంది విద్యార్థులు పోటీ పడుతు న్నారు. ఈ సంస్థల్లో ప్రవేశం పొందడం అంత సులభంకాదు.

## ఇంజినీరింగ్ రంగంలో అనేక విభాగాలు

విద్యార్థులు తమ ఆసక్తిని అనుసరించి ఆయా విభాగాలను ఎంపిక చేసుకుంటారు. ఎలక్ట్రానిక్స్, మెకానికల్, సివిల్, కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ వంటి పలు ఇంజినీరింగ్ శాఖల్లో ప్రవేశానికి, ప్రతిష్టాత్మక ఇంజినీరింగ్ కళాశాలల్లో చదవడానికి ఎంతో మంది విద్యార్థులు ఆసక్తి చూపుతూ ప్రసిద్ధి చెందిన కోచింగ్ సెంటర్లో శిక్షణ పొందడం గమనార్హం. 2025-26 సంవత్సరానికిగాను ఇంజినీరింగ్ రంగంలో ప్రవేశానికి ఐఐటి కాన్పూర్ జె.ఇ.ఇ అడ్వాన్స్డ్ పరీక్షల షెడ్యూల్ విడుదల చేసింది. దేశంలో గల 23 ఐఐటిల్లో జె.ఇ.ఇ మెయిన్ పరీక్షలో ఎంపిక కాబడిన వారు జె.ఈ.ఈ అడ్వాన్స్డ్ పరీక్షకు అర్హత సాధించగలరు. ఈ పరీక్షల్లో ర్యాంకు లు సాధించిన సుమారు 18000 మంది పలు ఐఐటిల్లో ప్రవేశానికి అర్హత పొందుతారు. మే 18వ తేదీన జరిగే ఈపరీక్షలకు ఎం.పి.సి ఇంటర్ విద్యార్థులు అర్హులు.మే నెల అనగానే చాలా దూరం ఉందనుకోవడం పొరపాటు. మార్చి నెలలో ఇంటర్ పరీక్షలు జరుగుతాయి. మార్చిలో ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు పూర్తయి, ఫలితాల వచ్చేసరికి ఏప్రిల్ నెల వచ్చేస్తుంది. కేవలం నెల రోజుల వ్యవధిలో జె.ఈ.ఈ పరీక్షలకు సిద్ధం కావలసి ఉంటుంది. ఈ సందర్భంగా విద్యార్థులు జె.ఇ.ఇ పరీక్షల గురించి, కటాఫ్ మార్కుల గురించి సవివరంగా తెలుసుకోవాలి. జాతీయ స్థాయి సంస్థల్లో ముఖ్యంగా ఐఐటి వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో స్థానం సంపాదించడం కత్తిమీద సాము వంటి వ్యవహారం. జె.ఇ.ఇ పరీక్షల్లో విజయం సాధించి, ఐఐటిల్లో ప్రవేశించడానికి ఎంతో ఆసక్తి, పట్టుదల, క్రమశిక్షణ, కఠోరమైన పరిశ్రమ అవసరం. వీటితో పాటు సునిశిత పరిశీలన, నిజమైన ప్రతిభ అవసరం. ఆషా మాషీగా చదవడం వలన సమయం వృథా. బట్టీ పట్టడం వలన ఐఐటి వంటి సంస్థల్లో ర్యాంకులు సాధించలేరు. ఐఐటి సంస్థల తర్వాత దేశంలో ఉత్తమ సాంకేతిక విద్యాసంస్థలుగా ఎన్ఐటిలు పేరుగాంచాయి. ఐఐటిలో ప్రవేశం పొందని వారికి ఎన్ఐటిలు ఆశాదీపాల్లా అగుపించడంలో అతిశయోక్తి లేదు. ఐఐటిలకు ధీటుగానే ఎన్ఐటిల్లో విద్యాప్రమాణాలుంటాయి. ఈ సంస్థల్లో చదివిన విద్యార్థులకు చక్కని ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఐఐటి, ఎన్ఐటిల్లో చదవగోరే విద్యార్థులు హైస్కూల్ స్థాయి నుండే అందుకు రంగం సిద్ధం చేసుకోవాలి. నైపుణ్యతను పెంపొందించుకోవాలి. ఇంటర్ ద్వితీయ సంవత్స రం చదువుతున్న విద్యార్థులు తరగతి పాఠ్యాంశాలతో పాటు, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల్లో ప్రవేశానికి తర్ఫీదు పొందాలి. 10వ తరగతి తర్వాత పాలిటెక్నిక్ సంస్థల్లో చదవా లనే ఆసక్తి గల విద్యార్థులు పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ప్రవేశ పరీక్ష కు సిద్ధంగా ఉండాలి. పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు కూడా మంచి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి. ఇంజినీరింగ్‌లో డిప్లొమా చేసిన విద్యార్థుల జీవనోపాధికి అనేక అవకాశాలు న్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో ట్రిపుల్ ఐటి ప్రవేశాలు 10వ తరగతి పరీక్షల్లో రెగ్యులర్ విద్యార్థుల ప్రతిభ ఆధారంగా నిర్ణయిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో నూజివీడు, ఇడుపుల పాయ, శ్రీకాకుళం, ఒంగోలులో ట్రిపుల్ ఐటిక్యాంపస్ లున్నాయి. మెరిట్ ఆధారంగా 6 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బి.టెక్ కోర్సులకు ఇక్కడ ప్రవేశాలు లభిస్తాయి. తెలంగాణలోని బాసర ట్రిపుల్ ఐటిలో వేలాది మంది విద్యార్థులు ప్రవేశాల కోసం పోటీపడుతున్నారు. గ్రామీణ ప్రాంతవాసులకు నాణ్య మైన విద్యనందించడంలో బాసర ట్రిపుల్ ఐటి ప్రాచుర్యం పొందింది. వచ్చే మార్చి నెలలో జరిగే 10వ తరగతి వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి ఉభయ తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఆయా ట్రిపుల్ ఐటిల్లో ప్రవేశం పొందడానికి తగిన కృషి చేయాలి. స్వేచ్ఛాయుత వాతావరణం నెలకొల్పాలి. గతంలో మాదిరిగా విద్యార్థు లకు స్వేచ్ఛగా చదువుకునే వాతావరణం లేదు. బాగా చదవాలి మంచి ర్యాంకులు సాధించాలి పోటీ పరీక్షల్లో విజేతలై ఉన్నత విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్, మెడికల్ కోర్సులను చదివి, యు.ఎస్‌లో ఎం.ఎస్. చేసి, డాలర్ల వర్షం కురిపించాలని తల్లిదండ్రులు వత్తిడి చేయడం తగదు. 10 తరగతి, ఇంటర్ స్థాయిల్లో వివిధ కారణాల వలన ఫెయిలైన విద్యార్థులు అవమానంతో, న్యూనతా భావంతో ప్రాణాలు తీసుకున్న సంఘటనలు చూసాం. ఇలాంటి పరిస్థితులు మారాలి. పరీక్షలు విద్యార్థి దశలో ఒక భాగం మాత్రమే తప్ప అదే మొత్తం జీవితమనుకునే ధోరణి మారాలి. విలువైన విద్యార్థుల జీవితాలు పరీక్షల కారణంగా నాశనం కాకూడదు. ప్రాణాలు తీసుకునేటంత సాహసానికి విద్యార్థులు తెగించడం సముచితం కాదు. పరీక్షా కాలం ప్రాణ హరణానికి కారణం కారాదు. పరీక్షల సమయంలో ఒత్తిడి, భయం లేని వాతావరణం కల్పించడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలి. పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనే ధైర్యం విద్యార్థుల మనసుల్లో అంకురించాలి. •





సింగిల్ పేజీ కథ

# గిరిజా కల్యాణం

**కనుమ ఎల్లారెడ్డి**

**గిరిజకు నా అన్నవాళ్ళు ఎవరూ లేరు, ఒంటరిగా జీవిస్తూ ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది.**

**గిరి ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులుగా పని చేస్తున్నాడు. గిరిజ ఇంటి సమీపంలోనే ఉంటాడు. అయినా ఎప్పుడూ ఇద్దరు కలిసి మాట్లాడు కున్నది లేదు. ఆడవాళ్లు అంటేనే అమడ దూరంలో ఉంటాడు గిరి.**

ప్రభుత్వ కళాశాలలో జరిగే వక్తృత్వ పోటీలకు తమ స్కూల్ పిల్లలను తీసుకు వచ్చింది గిరిజ. పోటీ జడ్జి స్థానంలో గిరి ఉన్నాడు.

"నమస్కారం" అంది గిరిజ. ప్రతి నమస్కారం చేశాడు గిరి. కేవలం పాఠశాల బాలికలు మాత్రమే పాల్గొనాలని షరతు, ఐదు పాఠశాలల నుంచి బాలికలు వచ్చారు. అంశం 'వరకట్నం–మరణాలు' బాలికందరూ బాలికలు మాట్లాడారు.

చివరిగా గిరిజ పాఠశాల బాలికలకు అవకాశం వచ్చింది. విజయ అనే బాలిక చాలా అనర్గళంగా మాట్లాడింది. ఆ అమ్మాయి పాయింట్స్ నోట్ చేసుకున్నాడు గిరి.

"రేపు ఫలితాలు ప్రకటిస్తాం, మీ, మీ సెల్ కు మెసేజ్ వస్తుందని" చెప్పి, టీచర్స్ సెల్ నంబర్స్ తీసుకున్నాడు.

గిరిజ కూడ నెంబర్ ఇచ్చింది. మరుసటి రోజు గిరిజ సెల్ మొగుతోంది. అప్పుడే స్నానం చేసి కురులు ఆరబెట్టుకుంటోంది. సెల్ నంబర్ చూసి లిఫ్ట్ చేసింది.

"హలో సార్!" అనగానే– "కంగ్రాట్స్ మేడమ్! మీ పాఠశాల అమ్మాయి విజయకు ప్రథమ బహుమతి వచ్చింది. అమ్మాయి చాలా చక్కగా మాట్లాడింది, కులం, మతం మనకు ముఖ్యం కాదు, గుణం ముఖ్యం, వరకట్నం ఇవ్వడం, పుచ్చుకోవడం నేరమని తాను మాట్లాడిన మాటలు మమ్మల్ని ఆకట్టుకున్నాయి.

గిరిజ నవ్వుతూ "మీరు ఎంత పుచ్చుకున్నారు" అని అడిగింది.

ఊహించని మాటకు అదిరిపడ్డాడు గిరి. "నాకు ఇంకా పెళ్లి కాలేదు. వరకట్నం మీద ఆశ లేదు. అమ్మాయి ఎవరైనా సరే, నేను అనాథను" అన్నాడు.

అక్కడ కొంచెంసేపు మోనం.

"హలో" అంది గిరిజ.

"చెప్పండి" అన్నాడు.

"మీకు ఎవరూ లేరా?" అంది.

"నాకు ఎవరూ లేరు. నేను అనాథను. కష్టపడి చదివి ఈ స్థాయికి వచ్చాను" అన్నాడు.

గిరిజ ఆలోచనలో పడింది. మళ్ళీ కాసేపు మోనం.

"హలో "అన్నాడు.

గిరిజ మాట్లాడలేదు ఫోన్ చెవి దగ్గర పెట్టుకుని అలానే ఉంది.

"హలో మీరేంత కట్నం ఇచ్చారు, మీ వారు..?" అని అడిగాడు.

ఆ మాటకు కిల కిలా నవ్వి "నేను మీ బాపతే. వరకట్నం నాకు ఇష్టం లేదు" అంది.

గిరి ధైర్యం చేసి "ఫోన్‌లో కాబట్టి మాట్లాడుతున్నాను. మీరంటే ఇష్టం. రేపు పార్వతీదేవి గుడికి రండి" అని టక్కున ఫోన్ పెట్టేశాడు.

ఇష్టం అనే మాట అనవసరంగా అన్నానేమో! అనుకుని భయపడి పోతున్నాడు. వళ్లంతా చెమటలు పట్టాయి. ఏమనుకుంటుందో ఏమో అనుకున్నాడు. ఆ రోజు ఆదివారం కావడంతో ముందుగా గిరి తెల్ల చొక్కా, తెల్ల ప్యాంటు టక్ చేసుకుని వెళ్ళాడు.

గిరిజ కూడా నీలి రంగు చీరలో, బ్లాక్ బ్లౌజ్‌తో సిగలో తెల్ల గులాబీతో దేవాలయపు మెట్ల మీద కూర్చుంది. దేవాలయంలో పార్వతీదేవికి కళ్యాణం జరుగుతోంది.

గిరిని చూడగానే కళ్ళు మెరిశాయి.. "రండి" అంటూ సైగ చేసింది గిరిజ.

గిరి అడుగులో అడుగు వేసుకుంటూ ఆమెను సమీపించాడు.

"కూర్చోండి..." అని సైగ చేసింది.

దేవాలయంలో మంత్రాలు వినపడుతున్నాయి లీలగా. ఆమె పక్కన కూర్చున్నాడు గిరి.

దేవాలయంలోని పూజారి మంత్రాలు చదువుతూ "అమ్మా! పార్వతీదేవి అన్నా గిరిజ అన్నా ఒకటే. ఈ కల్యాణం చూసిన వారికి, విన్నవారి వివాహం అవుతుంది శుభం" అని ముగించాడు.

గిరి, గిరిజ ముఖాలు చూసుకున్నారు. తన కుడి చేయి చాచింది గిరిజ, ఆమె చేతిలో చేయి వేశాడు గిరి. ఇద్దరూ లేచి పార్వతీ దేవికి నమస్కరించారు. పూజారి ఇద్దరి తలలపై అక్షతలు వేసి "కల్యాణమస్తు. పుత్రపౌత్రాభిరస్తు" అని ఆశీర్వదించాడు. ఇద్దరూ పూజారి కాళ్లకు నమస్కరించారు. గిరి పార్వతి దేవికి నమస్కరిస్తుంటే, అతని గుండెల్లో ఒదిగిపోయింది గిరిజ.

– ఒకరి ముందు ఒక మాట, మరొకరి ముందు మరో మాట చెప్పకూడదు, అనకూడదు. అసలు మనం వినకూడదు.

– నిరాశ, నిస్పృహ ఆవహించిన వారిని ఎవరూ మార్చలేరు.

# దృశ్యం

పడవ అలసిపోయింది తీరాన్ని చేరింది
తీరం పడవను అక్కున చేర్చుకుంది.
తనివి తీర ముద్దాడింది
మేట వేసిన ఇసుక తిన్నెల లాంటి
మెత్తని హృదయంలో తన రాక
ఆనవాళ్లను ముద్రించుకుంది
తచ్చాడుతున్న చిట్టి పొట్టి
అలలతో తోయ మాలికలల్లి



నది సైతం పడవకు
పాదాభిషేకం చేస్తోంది.

తీరాన్ని చూస్తే పెనిమిటి కోసం
ఎదురు చూస్తున్న పడతిని తలపిస్తుంది.
పడవని చూస్తే వాలిన పొద్దులో
తన వలపుల చుక్కను చూడబోతున్న
సంబరం కనిపిస్తుంది.
దృశ్యాన్ని చూస్తే....
రెండు వైపులా అందాలే
ఒకటేమో శ్రమ జీవన సౌందర్యం
మరొకటేమో సుందర ప్రాకృతిక
భావన చైతన్యం

– కె.రవీంద్రబాబు

# తలతిక్క పోరడు

కొంచెం కొంచెం తుంచుకొని తినే
ఇడ్లీముఖంవాడు
గోడచాటునో చెట్టుచాటునో నిలబడి
తొంగి తొంగి చూసే
దాగుడు మూతల ఆటగాడు

ఊశిపోయే లాగు పైకి పైకి
ఎత్తుకుంటూ
ఊరంతా తిరిగేవాడు

నెలకోసారి
నాయిన చొక్కా తొడుక్కుని
ఒల్లు దాచుకునేవాడు
జారిపోతున్న నిక్కరు
పట్టుకుని పట్టుకొని పట్టు
దప్పి పోతే
వీధుల వెంట



పరుగెత్తేవాడు

సముద్రాన్ని మింగెయ్యాలని
పెయ్యంత పున్నమి
నోరు
ఎర్రగా తెరుచుకొని
వచ్చేవాడు
కోటి తారకల వెన్నెల
వాడలో
కోడిపిల్లలా
తప్పిపోయినవాడు.

– గజ్జెల రామకృష్ణ

# విజయానికి సోపానాలు

ఏనాడైతే నీవు
కొందరి హృదయాలను ఆకట్టుకున్నావో
ఆ సాధన ఫలితం దరహాసం.
ఎప్పుడైతే నీవు
విజయపథంలో వెళ్తున్నావో
ఆ విజయానికి హేతువు మనో
నిశ్చయం.

ఏ
క్షణాల్లోన్నైనా ఎదుటివారి
మనసులను గెలిచావో
దానికి కారణం నీ చిరుహాసం.

ఎవరైనా నీ పట్ల
అనుచితంగా ప్రవర్తించినప్పుడు
నీవు పాటించే ఓరిమి అనే ఆయుధమే
నీ విజయానికి సోపానం.

ఎక్కడైనా నీకు
తిరుగుబాటు ఎదురైతే
నీవు చేయవలసింది చిరునవ్వుతో
కూడిన నిశ్శబ్ద యుద్ధం.

ఈ సత్యం
గ్రహించి
మందహాసంతో
కొందరికి మనసులతో
బాటు శత్రువు
హృదయాలను సైతం గెలువు.

– నాగముని.యం

ఈ వారం కవిత్వం

# నువ్వు ఎవరంటే..!?

నీ బంధుత్వానికి
బాంధవ్యానికి మధ్య ఊగిసలాడే
అదృశ్య ఉచ్ఛ్వాసవు
చినుకు చినుకు సూర్యోదయాల మధ్య
గగనంపై పొడిచిన
ఇంద్రధనుస్సులో
ఏడవ రంగువు.
నీ వాళ్లను
నిలబెట్టే క్రతువులో
క్షణం క్షణం మరణించైనా
బతుకు సంగీతంలో
పాటై పల్లవించే కోయిలవు.

ఊహల నిచ్చెన ఎక్కి
వాస్తవ నేలపై
తచ్చాడే శ్రమ జీవన
స్వేదానివి.

మనసును
ప్రేమకు ముడేసుకుని
నీలో నువ్వే
గిరగిరా తిరిగే
రంగుల రాట్నానివి..!
ఆటుపోటుల
సంద్రంలో
కెరటమై తాకే జ్ఞాపకానివి.
నిశ్శబ్దంగా కదిలిపోయే
సైకత చిత్రానివి.

– డా॥ కటుకోఝ్వల రమేష్

## సరదా రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. *sunmagvaargtha@gmail.com*

# సూపర్ చిప్స్

సినిమాకి వెళ్లామంటే చిప్స్ ప్యాకెట్ ఖాళీ అయిపోతుంది. చాయ్ తాగుతున్నా, చారన్నం తింటున్నా.. ప్లేటులో కొన్ని చిప్స్ ఉంటే.. ఆహా అదెంత మజానో! కరకరలాడే చిప్స్. పిల్లలూ పెద్దలూ అందరికీ నచ్చేస్తాయి. మనం తరచూ తినే ఆలూ, బేండీ ఫ్రిట్టర్స్‌తో పాటు ఇంకెన్నో రకాల చిప్స్ ఇంట్లోనే ఎంచక్కా..

## అరటి చిప్స్ ..



**కావలసినవి :** కూర అరటి కాయలు పెద్దవి-2, ఉప్పు-తగినంత, పసుపు-అర చెంచా, నూనె- వేయించడానికి సరిపడా. **తయారీ :** ముందుగా కూర అరటి కాయలను తొక్క తీసి, గుండ్రంగా ముక్కలు కోయాలి. చేతులకు నూనె రాసుకుంటే మంచిది. లేదంటే నల్లగా అవుతాయి. ముక్కల్లో 4 కప్పుల నీళ్లు, ఉప్పు, పసుపు వేసి, రెండు మూడు నిమిషాలు అలా ఉంచాలి. ముక్కలకు పసుపు, ఉప్పు పట్టిన తర్వాత నీళ్లను వడకట్టేయాలి. వీటిని కాగుతున్న నూనెలో వేయించి టిష్యూ పేపర్ మీద వేస్తే అదనంగా ఉన్న నూనెను పీల్చేసుకుంటాయి. ఈ టేస్టీ బనానా చిప్స్ గాలి చొరబడని డబ్బాలో భద్రంచేస్తే నెల రోజులు నిలవ వుంటాయి.

## లోటస్ రూట్ చిప్స్ ..



**కావలసినవి:** తామర వేరు (లోటస్ రూట్)-2 కారం-చెంచా, ఉప్పు- తగినంత, నూనె-వేయించ డానికి సరిపడా. **తయారీ :** పీల్ చేసిన తామరవేరును వీలైనంత సన్నగా స్లైసులుగా కట్ చేసి, పేపర్ టవల్ మీద వేయాలి. చెమ్మ ఇంకిపోయాక కాగుతున్న నూనెలో మూడు నిమిషాలు వేయించాలి. బంగారు రంగులోకి మారగానే తీసి కారం, ఉప్పు చల్లితే నోరూరించే లోటస్ రూట్ చిప్స్ సిద్ధం.

## కాకర..



**కావలసినవి :** కాకర కాయలు-4, శనగ పిండి, మొక్కజొన్న పిండి, బియ్యప్పిండి-2 టేబుల్ స్పూన్ల చొప్పున, ఆమ్‌చూర్ పౌడర్, పసుపు-చెంచా చొప్పున, కారం-ఒకటిన్నర చెంచా, ఉప్పు-తగినంత, నూనె- వేయించడానికి సరిపడా. **తయారీ:** ముందుగా కాకరకాయలను కడిగి, తడి లేకుండా ఆరబెట్టాలి. వాటిని గుండ్రంగా/నిలువుగా అన్నీ సమానంగా ఉండేలా కట్ చేసుకోవాలి. శనగ పిండి, మొక్కజొన్న పిండి, బియ్యప్పిండి, కారం, ఆమ్‌చూర్ పౌడర్, పసుపు, ఉప్పు- అన్నీ వేసి బాగా కలపాలి. ముక్కలను పిండితే మెత్తగా అయిపోతాయి. కనుక మెల్లగా, జాగ్రత్తగా కలపాలి. కడాయిలో నూనె కాగిన తర్వాత మీడియం ఫ్లేమ్ మీద ఈ ముక్కలను దోరగా వేయిస్తే సరిపోతుంది. చేదు విరిగిపోయి కరకరలాడే కాకర చిప్స్ రెడీ.

## చిలగడదుంప..



**కావలసినవి:** చిలకడ దుంపలు-4, ఉప్పు- తగినంత, కారం-చెంచా, నూనె-వేయించడానికి సరిపడా. **తయారీ :** చిలగడదుంపలు కడిగి, పీల్‌చేసి.. స్లైసర్‌తో సన్నగా తరగాలి. వీటిని కాగుతున్న నూనెలో వేయించి, బంగారు రంగులోకి మారగానే తీయాలి. కొద్దిగా చల్లారనిచ్చి కారం, ఉప్పు వేసి కలిపితే సరి. సూపర్ రుచితో చిలకడదుంప చిప్స్ తయారైపోతాయి.

## పనస..



**కావలసినవి :** కాస్త పచ్చిగా ఉన్న పనసపండు తొనలు-20, ఉప్పు- తగినంత, పసుపు-పావు చెంచా, మిరియాల పొడి- అరచెంచా, నూనె- వేయించడానికి సరిపడా. **తయారీ :** పనస తొనల్లో గింజలు తీసేసి సన్నగా పొడుగ్గా ముక్కలు కోసుకోవాలి. కడాయిలో నూనె కాగనిచ్చి, పనస ముక్కలను కొన్ని కొన్ని చొప్పున హై ఫ్లేమ్‌లో రెండు నిమిషాలుంచాలి. సెగ తగ్గించి బంగారు రంగులోకి మారేదాకా వేయించి తీయాలి. చల్లారిన తర్వాత ఉప్పు, పసుపు, మిరియాల పొడి వేసి అన్నిటికీ సమంగా పట్టేలా ఎగరేస్తూ కలపాలి... పనస చిప్స్ సిద్ధం.

## యాపిల్..

**కావలసినవి:** గ్రీన్ యాపిల్ -రెండు, పంచదార-2 టేబుల్ స్పూన్లు, దాల్చినచెక్క పొడి- చెంచా, డార్క్ చాక్లెట్, ఫ్రెష్ క్రీమ్-అర కప్పు చొప్పున. **తయారీ:** యాపిల్ కోరర్ సాయంతో వాటి మధ్యలో గింజలతో పెళుసుగా ఉండే భాగాన్ని తీసేయాలి. తర్వాత గుండ్రంగా స్లైసులుగా కట్ చేయాలి. అవి మరీ మందంగా, మరీ సన్నగా లేకుండా మధ్యస్థంగా ఉంటే బాగా వేగుతాయి. ఒక పాత్రలో పంచదార, దాల్చినచెక్క పొడి వేసి కలపాలి. బేకింగ్ ట్రేలో సిలికాన్ మ్యాట్ లేదా బటర్ పేపర్ పరిచి, కాస్త పంచదార చల్లి, యాపిల్ ముక్కలను పేర్చాలి. మిగిలిన పంచదారను ముక్కల మీద చల్లాలి. అవెన్‌ను 130 డిగ్రీల వరకూ ప్రీహీట్ చేసి పది నుంచి పన్నెండు నిమిషాలు బేక్ చేస్తే చిప్స్ తయారవుతాయి.





# బహుళ ప్రయోజనకారి 'అక్వేరియం'

తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి

పెంపుడు జంతువులతో ఆడుకోవడం విశ్రాంతి నిచ్చినట్లుగానే ఆక్వేరియంలో తిరుగాడే రంగుల చేప పిల్లలను చూస్తూ గడిపే క్షణాలు కూడా మనసుకు సాంత్వన కలిగిస్తాయని అంటున్నారు పరిశోధకులు. అక్వేరియం, చేపలు ఉండే ట్యాంకులు చూస్తూ ఉంటే రక్తపోటు కాస్త తగ్గుతుందట. యూకేలోని నేషనల్ మెరైన్ అక్వేరియం, ప్లేమౌత్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ ఎక్స్‌టర్‌కి చెందిన పలువురు నిపుణులైన పరిశోధకులు సర్వే ద్వారా వెల్లడించారు. అక్వేరియం చూస్తూ ఉన్నవారిలో రక్తపోటు తగ్గినట్లు తాము గుర్తించినట్లు తెలిపారు. ఈదుతున్న చేప పిల్లలను కాసేపు చూస్తూ కూర్చుంటే అలసిన మనసుకు కాస్త విశ్రాంతి దొరుకుతుందని, దైనందిన వ్యవహారాలతో సొలసిన తరుణంలో స్వేచ్ఛగా తిరుగాడే మీనాలకేసి చూసే ఒక్క క్షణం మన ఆలోచనల్లో మార్పు తెస్తుందని శాస్త్రజ్ఞులు అంటారు.

ఇప్పుడు పిల్లలూ, పెద్దలూ రంగుల చేపల పెంపకంపై ఆసక్తి కనబరుస్తున్నారు. వీటి ధరలు కూడా అందరికీ అందుబాట్లో ఉంటున్నాయి. పాఠశాలల్లో, ఇళ్లల్లో, కార్యాలయాల్లో రంగుచేపలను ఎక్కువగా పెంచుతున్నారు.

## అక్వేరియమ్ (గాజుశ కుప్పె)

అక్వేరియం నుంచి ఆర్థిక పరిస్థితిని బట్టి ఎన్ని అడుగుల అక్వేరియంలు కావాలన్నా అతి పెద్ద గాజుపలకలతో, ప్లాస్టిక్ షీట్స్ అతికిస్తూ వ్యాపారులు తయారు చేసి విక్రయిస్తున్నారు. అలంకరణకు రంగు రాళ్లు, వివిధ రకాలైన బొమ్మలు, దానిలోపల చిన్నపాటి ట్యూబ్ లైట్‌ను కూడా అమరుస్తుండటంతో మీనాలు మరింత ఉత్సాహంగా కదలాడుతున్నాయి. తాబేళ్లను కూడా ఉత్సాహంగా కొనుగోలు చేస్తుండటంతో గార్డెన్స్‌లో వీటి విక్రయం పెరుగుతోంది. నీటిలో బ్యాక్టీరియాను నిరోధించేందుకు పచ్చ, నీలి రంగులతో కూడిన లిక్విడ్‌లను ఉపయోగిస్తున్నారు. ఒత్తిడిలో ఉన్న సమయంలో కాసేపు రంగు చేపలను తదేకంగా చూడడం వల్ల ఉపశమనం కలుగుతుందనేది శాస్త్రీయంగా కూడా రుజువు కావడంతో ఆసుపత్రులు, కార్యాలయాల్లో రంగుచేపల తొట్టెలు ఉంచుతున్నారు.

సాధారణంగానే ప్రకృతిని, సహజసిద్ధమైన అందాలను చూస్తుంటే ఆహ్లాదంగా ఉంటుంది. మంచినీటిలో పెరిగే అందమైన రంగు చేపల పెంపకం ఈనాటిది కాదు. అక్వేరియాలకు 4 వేల ఏళ్ల చరిత్ర. క్రీ.పూ. 2500 సంవత్సరాల్లోనే సుమేరియన్లు రంగు రంగుల చేపలను తెచ్చుకుని ఇళ్లముందు గొయ్యి తవ్వి పెంచుకునేవారట. అయితే వాళ్లు మనలాగా చేపలతో ముచ్చట్లాడేందుకు కాదుగానీ, కావాల్సినప్పుడల్లా వండుకుని తినేందుకే వాటిని పెంచుకునేవారట.

అక్వేరియం అనే పదాన్ని మొట్టమొదటిసారిగా 1850వ సంవత్సరంలో లండన్‌కు చెందిన ఫిలిప్‌గోస్ అనే ప్రకృతి శాస్త్రజ్ఞుడు ఉపయోగించాడట. జలచరాలపై పరిశోధనల కోసం పెద్ద పెద్ద గాజు గదులను తయారు చేయించిన ఆయన వాటికి అక్వేరియం అని నామకరణం చేశాడట. తరువాత 1853లో లండన్ ప్రజలు చూసేందుకు వీలుగా అతిపెద్ద అక్వేరియంను ఏర్పాటు చేశారట. జర్మనీ రాజధాని బెర్లిన్‌లో రాడిసన్ బ్లూ అనే పెద్ద ఫైవ్ స్టార్ హోటల్ ఉంది. ఆ హోటల్ మధ్యలో ఎనభై రెండు అడుగుల పొడవాటి సిలిండ్రికల్ అక్వేరియంను నిర్మించారు. చేపలను చూసేందుకు దాని మధ్య భాగంలో లిఫ్ట్ కూడా ఏర్పాటు చేశారు. ప్రపంచంలోనే అతి పెద్ద సిలిండ్రికల్ ట్యాంక్ ఇదేనట.

అక్వేరియం చేపలలో ఎన్నో రకాలున్నాయి. ఆరెంజ్ గోల్డ్‌ఫిష్, బ్లాక్‌గోల్డ్, వ్హైట్స్‌గోల్డ్, బ్లాక్ మాలీస్, ఆరెంజ్ మాలీస్, గప్పీలు, సింగపూర్ గప్పీలు.. ఇలా ఎన్నో రకాలైన రంగుచేపలు అందుబాటులో ఉన్నాయి.



గోల్డ్ ఫిష్, బ్లాక్ మాలిష్, ఫైటర్ ఏంజెల్స్, బార్బ్స్, రాస్, బోరాస్ , చెర్రీ బార్బ్, గోల్డెన్ బార్బ్, ఫైవ్ బాండెడ్ బార్బ్, హార్లే క్వీన్, కారిడొరాస్ క్యాట్ ఫిస్, ఆల్బినో, పెప్పర్డ్ కారిడొరాస్, డానియోస్, లియోఫర్డ్ డానియోస్ రకాలు అక్వేరియాలకు ఉపకరిస్తాయి. ఇక రెడ్ టైల్డ్ క్యాట్ ఫిష్, పెడిల్ ఫిష్, సౌత్ అమెరికన్ లీఫ్ ఫిష్ పెద్ద పెద్ద అక్వేరియాలకు మాత్రమే పనికి వస్తాయి.

హోం మెరైన్ అక్వేరియంలో ట్రిటిల్ స్టార్స్ చేపలను అధికంగా ఉపయోగిస్తారు. అయితే ఉప్పు శాతం, పిహెచ్ రేషియో, ఇతర రసాయన ప్రమాణాలు సరైన పాళ్లలో ఉండాలి. లేకపోతే ట్రిటిల్ స్టార్స్ చనిపోయే అవకాశం ఉంటుంది. ఇటీవలే ఒపహా అనే వేడి రక్తం కలిగిన ఉన్న చేపలను శాస్త్రవేత్తలు గుర్తించారు. ప్రపంచంలో ఒపాహా చేప ఒక్కటే వేడి రక్తం కలిగిన చేప. ఇక పోతే, మనం ఎన్నో రకరకాల చేపలను అక్వేరియంలో చూస్తుంటాం. కాని, హాఫ్ మూన్ బెట్ట చేపలు మాత్రం అక్వేరియం చేపలలో మహారాణులని చెప్పవచ్చు. ఇంద్రధనస్సులో ఎన్ని రంగులు ఉన్నాయో అన్ని రంగులలో ఆ చేపలు దొరుకుతాయి. అక్వేరియంలో ఉంచాల్సిన దానికన్నా ఎక్కువ చేపలు ఉంచినట్టయితే, చేపల విసర్జితాలు ఎక్కువగా ఉత్పత్తి అయ్యి నీటిలో అమ్మోనియాను తయారు చేస్తాయి. ఈ పదార్థం చేపలకు చాలా హానికరం.

మొత్తం అక్వేరియం నీటిని మార్చటం సరైన పద్ధతి కాదు. గాజు గోడలను స్క్రబ్బార్‌తో క్లీన్ చేసి, ఒక పొడుగాటి గొట్టంతో నీటి అడుగున వున్న చెత్త, చేపల విసర్జితాలు మొదలైనవి తీసివెయ్యాలి. సగానికి పైగా నీటిని తీసివేసి అప్పుడు కొత్త నీరు పొయ్యాలి. చేపలను డైరెక్ట్‌గా నెట్ అవుట్ చెయ్యకుండా నీళ్ళు ఉన్న కంటైనర్ సహాయంతో బయటకు తీస్తే మంచిది. రసాయన సమతుల్యం లోపించడం వల్ల బాక్టీరియా విపరీతంగా పెరగడం, చెత్తా చెదారం పేరుకుపోవడం వల్ల నీళ్ల రంగు మారుతాయి. దీనివల్ల వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువ. అక్వేరియంలోని నీటిని ప్రతి పది రోజులకు ఒకసారి మార్చాలి. రెండు పూటలా మేత వేయాలి. చనిపోయిన చేపలను తొలగించాలి. కొన్ని రకాల చేపలకు ఆక్సిజన్ తప్పనిసరిగా అవసరం వుంటుంది.



ఆక్వేరియంలో చేపలు చనిపోవటానికి చాలా కారణాలు ఉంటాయి. బౌల్స్ లో చేపలు పెంచటం అంత మంచిది కాదు. గోల్డ్ ఫిష్ లాంటి చేపలకు నీటిలో ఆక్సిజన్ శాతం ఎక్కువగా ఉండాలి. నీటి క్వాలిటి ఏమాత్రం తగ్గిన తొందరగా జబ్బుకు గురి అవుతాయి. నీటి మీద వైశాల్యం ఎక్కువగా ఉంటే ఆక్సిజన్ నీటిలో కరిగే రేటు ఎక్కువగా ఉంటుంది. బౌల్స్‌కి ద్వారం చిన్నగా ఉండటం వల్ల ఎక్కువ ఆక్సిజన్ నీటిలో కరగదు. అలాగే ఒక ఎరేషన్ సిస్టం (నీటిలో బుడగలు ఉత్పత్తి చేసే పరికరం)ని వాడాలి. అది ఆక్సిజన్ శాతం నీటిలో తగ్గకుండా చూస్తుంది. చాలామంది అక్వేరియం షాపువాళ్ళు కొత్తగా హాబీ మొదలు పెట్టేవారికి, అందంగా ఆకర్షణీయంగా ఉండటం వల్ల గోల్డ్ ఫిష్ అమ్మేస్తుంటారు. కాని బిగినర్స్‌కి ఇవి అంత మంచివి కాదు.

ఇక్కడ ఒక విషయం అర్థం చేసుకోవాలి. చేపలు నీటి ఉష్ణోగ్రతలలో సడన్‌గా మార్పు వస్తే అవి ఎక్కువ ఒత్తిడికి గురి అవుతాయి. కొన్ని సార్లు ఈ తేడా ఎక్కువగా ఉంటె వెంటనే చనిపోతాయి. ఈ మార్పులు సాధారణంగా నీళ్లు మారుస్తున్నప్పుడు వస్తాయి.

చనిపోయిన చేపలను తొలగించాలి. అనారోగ్యం బారిన పడినవాటిని తోక వద్ద ఏర్పడిన మచ్చల ద్వారా గుర్తించవచ్చు.

ప్రతిరోజూ వాటర్‌ను మార్చడం వల్ల అందులో ఉన్న చేపలు కొత్తగా ఫీలవ్వడంతో పాటు వాటి శరీరం చల్లదనాన్ని ఆస్వాదిస్తుంది. కాబట్టి టాంక్ హీట్ తగ్గించి ప్రతిరోజూ నీటిని మార్చుతుండాలి. అది కూడా సాయంత్రంపూట మాత్రమే నీటిని మార్చాలి. కొంత మంది చేపలు ఇటు అటు తిరుగుతుంటే క్లియర్‌గా కనబడాలని ఎప్పుడూ ఫ్లాష్ లైట్స్ వేసే ఉంచుతారు. పగలు వేడి ఎక్కువగా ఉంటుంది కాబట్టి పగలు లైట్స్‌ను ఆఫ్ చేయడమే ఉత్తమం. అందులో ఉన్న నీళ్ళు చల్లగా ఉంటాయి. సాయంత్రం కావాలనుకుంటే లైట్స్ ఆన్ చేసుకోవాలి. లేదంటే గదిలో వెలిగే లైట్స్ వెలుతురే సరిపోతుంది. ఫిష్ టాంక్‌ను చల్లటి ప్రదేశంలో ఉంచాలి. లేదంటే వేడిగాలులు ఇంట్లోకి ప్రవేశించి చేపలు చనిపోతాయి. కాబట్టి టాంక్ ఉన్న ప్రదేశంలో కిటికీలను మూసి వుంచాలి. చిన్న సైజులో ఉన్న క్లిప్ ఫ్యాన్స్‌ను వినియోగించి టాంక్‌కు సరిపడినంత దూరంలో ఉంచే ఫ్రెష్ ఎయిర్‌ను అందించి టాంక్‌ను కూల్‌గా ఉంచవచ్చు.

## వాస్తు పరంగా...

అక్వేరియంను ఇంట్లో ఏర్పాటు చేసుకోవడం వల్ల సంపద, ఆరోగ్యం, ఆనందం కలుగుతుందని ఫెంగ్‌షుయ్ చెబుతోంది. విలాసవంతానికి, ఇంట్లో ఉల్లాసభరితమైన శక్తికి కూడా అక్వేరియం ఏర్పాటు ఇటీవల విరివిగా పెరుగుతోంది. ఇంట్లో చేపల అక్వేరియం పెట్టుకోవడం సంపద వృద్ధి కావడానికి దోహదం చేస్తుందిట. ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండే చేపలను ఎంచుకొని ఇంట్లో అక్వేరియం ఏర్పాటు చేసుకుంటే సంపద వృద్ధి చెందుతుంది. ఫిష్ ఆక్వేరియం ధన స్థిరత్వానికి ప్రతీక. అందువల్ల ఆఫీసు గదిలో గోల్డ్ ఫిష్ ఉండేలా ఎక్వేరియం ఏర్పాటు చేసుకోవటం వల్ల ఆర్థికస్థితి గతులు కొలిక్కి వచ్చి మెరుగవుతాయి. కంప్యూటర్స్, టెలిఫోన్స్, ఫ్యాక్స్ మెషీన్స్ వంటి వాటిని పశ్చిమ దిశలో ఉండేటట్లు ఏర్పాటు చేసుకోవాలి.

అలాగే ఆఫీసు గదికి వాడే రంగులు చేస్తున్న వ్యాపార గుణాన్ని ప్రతిబింబించాలి. అక్వేరియంలో నీటిని శుభ్రంగా ఉంచుతూ, గాలిపోయేలా ఏర్పాటు చేసుకోవాలి. చేపలు అక్వేరియంలో తిరుగుతూ ఉంటే ఆ శక్తి ఇంట్లో సంపద వృద్ధి కావడానికి దోహదం చేస్తుందిట. దీనిని గదిలో నైరుతి దిక్కున ఉంచడం మంచిదని ఫెంగ్‌షుయ్ చెబుతోంది. ఫెంగ్‌షుయ్ సూత్రాల ప్రకారం ప్రతి ఇంట్లో అక్వేరియం, వాటర్ ఫౌంటెన్లు ఉండాల్సిందే! వాటిని సరైన స్థానంలో ఉంచితే ఇంటికి ప్రత్యేకమైన ఆస్తిగా పరిగణించవచ్చు. పరిశుభ్రమైన నీరు ఉండటం వల్ల మంచి ఆరోగ్యానికి, ఐశ్వర్యానికి సంకేతాలని చెప్పొచ్చు.

## వ్యాపారాభివృద్ధికి..

వ్యాపారంలో విజయం సాధించి, ఆస్తిని సంపాదించాలనుకున్నా ప్రతి ఇంట్లో మర్చంట్ షిప్ అనే గుర్తును పెట్టుకోవాలి. దీన్ని ఇల్లు లేదా ఆఫీసు ముందు భాగంలో పెట్టుకుంటే అధిక ఆదాయం ఆర్జించడానికి వీలవుతుందని ఫెంగ్‌షుయ్ చెబుతోంది. ■





కథ

# కాకి దురాలోచన

రామచిలుక, వడ్రంగి పిట్ట మంచి స్నేహితులు. ఒకరోజు అవి ఆకాశంలో ఆనందంగా ఎగరసాగాయి. ఎండ వేడి పెరగటంతో ఎక్కడైనా విశ్రాంతి తీసుకోవాలనుకున్నాయి. కిందకు చూశాయి. ఓ పెద్ద మర్రిచెట్టు కనపడింది. ఆనందంతో రెండు పక్షులు చెట్టు మీద వాలాయి. కాసేపు సేద తీరాలని నిర్ణయించుకున్నాయి. మాటల మధ్య ఎవరు గొప్పో అనే చర్చ వచ్చింది. నేను గొప్పంటే– కాదు, నేను గొప్పని వాదించుకో సాగాయి. అప్పటిదాకా స్నేహంగా మెలిగిన అవి బద్ధశత్రువుల్లా మారిపోయాయి. ఇదంతా దూరం నుంచి ఒక కాకి గమనించింది. పక్షులున్న కొమ్మ మీదకు ఎగురుకుంటూ వచ్చింది. విరోధులుగా మారిన స్నేహితులను చూసి లోలోపల ఆనందపడింది. దానికి ఎప్పటి నుంచో వాటిని చంపి తినాలని కోరిక. ఆ విషయం బయట పడకుండా వాటిని ఉద్దేశించి మాట్లాడింది. ఇప్పటిదాకా మీరు స్నేహితుల్లా మెలిగారు. ఒక్కసారి బద్ధశత్రువులుగా మారటం బాధాకరం. మిత్రుల మధ్య అలకలు ఉండాలి కానీ అపార్థాలు ఉండకూడదు అంటూ లేని ప్రేమను కనబర్చింది, చిలుక, వడ్రంగిపిట్టకు. కాకి దొంగ పొగడ్తలతో చిర్రెత్తుకొచ్చింది. నీ మాటలు కట్టిపెట్టు. మా ఇద్దరిలో ఎవరు గొప్పో తేల్చు అన్నాయి. ముందుగా చిలుకతో పక్షుల్లో నీ అంత అందమైన పక్షి లేదు. ఆకుపచ్చని రంగు బాగుంటుంది. అలాగే నీ ముక్కు కూడా. పండ్లను నీలా ముక్కుతో పొడిచి అందంగా తినటం మరో పక్షి చేయలేదు. అంతెందుకు.. నీ అందంలో కొద్దిగైనా ఆ దేవుడు నాకు ఇవ్వలేదు. పైగా నీ మాటలు ముద్దొస్తాయి అని పొగిడింది. అలాగే వడ్రంగి పిట్టతో నీ ముక్కు పొడవు. అది నీ అందాన్ని రెట్టింపు చేస్తుంది. పదునైన ముక్కుతో చెట్లకు రంధ్రాలు చేసి నివాసాలుగా మార్చుకోవటం ప్రశంసనీయం అన్నది. నీలా చెట్లకు రంధ్రాలు చేయటం మరో పక్షికి చేతకాదు. దాంతో నువ్వెంత బలవంతురాలివో అర్థం అవుతుందని అన్నది. దానికి రెండు పక్షులు మమ్మల్ని అతిగా పొగడటం మాని మాలో ఎవరు గొప్పో తేల్చు అన్నాయి. అవి తన దారిలోకి వస్తున్నాయని గ్రహించింది కాకి. తన దురుద్దేశాన్ని బయట పడనీయలేదు. మీరిద్దరూ అన్నింట్లో సమానమే. పోటీ కాబట్టి ఎవరు గొప్పో నేను నిర్ణయిస్తాను అన్నది.



కాకి మాటలకు రెండూ అంగీకరించాయి. కాకి పక్షులను ఉద్దేశించి ఇక్కడ నుంచి దూరంగా కనపడుతున్న గుట్ట వద్దకు ముందుగా వెళ్లి తిరిగి వస్తారో వారే విజేతలు అన్నది. వెంటనే అవి గుట్ట వైపు ఎగరసాగాయి. కొద్దిదూరం పోయాక అలసటతో ఒక చెట్టు మీద వాలాయి. అక్కడో కోతి కనపడింది. అది కాకి పెట్టిన పోటీ గురించి తెలుసుకుని పెద్దగా నవ్వసాగింది. ఎందుకు నవ్వుతున్నావని చిలుక, వడ్రంగి పిట్ట ప్రశ్నించాయి. కోతి వాటితో– కాకి ఎప్పటి నుంచో మిమ్మల్ని తినాలని ప్రయత్నిస్తోంది. పోటీలో ముందుగా వచ్చిన పక్షిని తిని, వెనుక వచ్చినదాన్ని తర్వాత ఆరగిస్తుంది. మీ ఇద్దరిలో ఎవరు గెలిచినా ఓడినా కాకికి ఆహారం కావాల్సిందే! అన్నది. కోతి మాటలతో వాటి కళ్లు తెరుచుకున్నాయి. బతుకుజీవుడా అనుకుంటూ అటునుంచి అటే మరో ప్రదేశానికి ఎగిరిపోయాయి. లొట్టలు వేసుకుంటూ ఎదురు చూసిన కాకికి నిరాశే ఎదురైంది.

**- తమ్మవరపు వెంకట సాయి,** సుచిత్ర





## బాలగేయం

### ఊగాడు



**ఊగాడమ్మా**

ఊగాడు
ఉంగా ఉంగా
ఊగాడు
ఉదయ సూర్యుడూ
ఊగాడు
వెలుగు దీపమా ఊగాడు
వెన్నెలవానా ఊగాడు
జాబిలికూనా ఊగాడు
చక్కని చుక్కా ఊగాడు
తెల్లటిమబ్బా ఊగాడు
నెమలిపింఛమా ఊగాడు
ముద్దుల చిలకా ఊగాడు
పూలపందిరీ ఊగాడు
తంగెడుపూవా ఊగాడు
నుదుట తిలకమా
ఊగాడు

కళ్లకాటుకా ఊగాడు
మేలిముత్యమా ఊగాడు
వేదమంత్రమా ఊగాడు
కోవెలగంటా ఊగాడు
నవ్వులరేడూ ఊగాడు..

– బొబ్బిలి శ్రీధర్

## హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు
వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**ఎ.మేఖల,** నాందేడ్

**ప్రశ్న: నెమలి ఈకలు రంగులతో ఉంటాయి. నెమలి ధాతువును రసాయన శాస్త్రంలో ఏమంటారు?**

**జవాబు:** రసాయన శాస్త్రంలో నెమలి ధాతువును కాపర్ ఐరన్ సల్ఫైడ్ అంటారు. దీనినే బోర్నైట్‌గా వ్యవహరిస్తారు. చల్లటి గాలికి ఇది ప్రభావితమై రంగుల బుకే(పూలబంతి) మాదిరి కనిపిస్తుంది. ఇది ఇన్‌డీసెంట్ టార్నిష్ వల్ల జరుగుతుంది. ఇది వివిధ కాపర్ ఆక్సైడ్ లేదా హైడ్రో ఆక్సైడ్‌తో తయారవుతుంది. ఇది బోర్నైట్ మీద ఒక అణువంత పలుచటి పొరగా ఏర్పడుతుంది. ఈ పొర మందం కాంతి వేవ్ లెంగ్త్‌కు సమీపంగా ఉంటుంది. బోర్నైట్ ఉపరితలం మీద టార్నిష్ పొరకు మధ్య కాంతి తరంగాలు హఠాత్తుగా పడినప్పుడు వేవ్ లెంగ్త్‌తో కూడిన వివిధ రంగులను కాంతి తరంగాలు వదిలివేయగా రెయిన్‌బో(ఇంద్రధనుస్సు) తరహాలో కనిపిస్తుంది.

**ఎ.భాస్కర్,** శివమొగ్గ

**ప్రశ్న: ఫ్రెంచ్ లీవ్ అంటే ఏమిటి? దానికా పేరు ఎలా వచ్చింది?**

**జవాబు:** ఫ్రెంచి సైనికులు యుద్ధానంతరం పౌరుల వద్ద నుంచి తమకు అడగకుండానే కావాల్సినన్ని వస్తువులు తీసుకుపోయేవారు. వాటికి మూల్యం చెల్లించేవారు కాదు. కనీసం ధన్యవాదాలు కూడా చెప్పేవారు కాదట. దాంతో స్వార్థపరులను, తమ సౌఖ్యం మాత్రమే చూసుకునే సంకుచిత మనస్కులను, ప్రతిఫలం ఇవ్వకుండా పనులను చేయించుకునే వారిని ఫ్రెంచ్ టైప్ వర్ణించేవారు.

ఫ్రెంచ్ వారికి మరో దురలవాటు ఉందట. అద్దె ఇల్లు ఖాళీ చేసేటప్పుడు ఎవరితోనూ చెప్పాపెట్టకుండా మెల్లగా జారుకోవడం. ఇలా మెల్లగా జారుకోవడాన్ని లీవింగ్ లైక్ ఫ్రెంచ్ అంటారు. ఇక చెప్పాపెట్టకుండా ఆఫీసు ఎగ్గొట్టి మరునాడు వెళ్లి దొంగతనంగా అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టే అలవాటును ఆంగ్లేయ దొరలు కనిపెట్టారు. ఇలా చేసే దానిని ఫ్రెంచ్ లీవ్ అని పేరు పెట్టారు.

# పర్యాటకం ఎంతో పసందు

కందుకూరి భాస్కర్

**రోజువారి** యాంత్రిక జీవితంలో అలసట చెందిన మనం సెలవు రోజుల్లో చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లోని ఆహ్లాదకర ప్రదేశాలు, చారిత్రక స్థలాలు సందర్శించి ఉల్లాసంగా గడపడం కోసం ప్రయత్నం చేస్తాం. ఇందతా టూరిజంలో ఒక భాగమే. పర్యటనల వల్ల స్థానికేతర ప్రాంతాల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, విందులు, వినోదాలు అనేక కొత్త కొత్త విషయాల గురించి తెలుసుకునే అవకాశం కలుగుతుంది. దీనినే 'పర్యాటకం' అని అంటారు. ఆయా ప్రదేశాలను చూసి రావడాన్ని 'టూరిజం ఆక్టివిటీ' అని అంటారు. పర్యాటకం అనే పదాన్ని ప్రజలు సాధారణంగా నివసించే, పనిచేసే ప్రదేశాల నుండి వెలుపలి స్థానాలకు తాత్కాలిక, స్వల్పకాలిక, కదలికలను వివరించడానికి ఉపయోగిస్తారు.

సాధారణంగా ప్రజలు ప్రయాణ అవసరాలైన వసతి, విద్య, ఉపాధి, ఆహారం, రవాణా, షాపింగ్, వినోదం, ఆరోగ్యం మొదలైన వాటికోసం వారి గమ్య స్థానాల నుండి ఇతర ప్రాంతాలకు వెళ్తారు. మరికొందరు మతపరమైన పుణ్యక్షేత్రాలను సందర్శించడం కోసం ఆనందం, జ్ఞానం కోసం లేదా ఆర్థిక లాభాల కోసం దేశం నుండి బయటకు వెళ్లడం జరుగుతుంది. ఇంకొందరు ప్రపంచంలోని అద్భుత దృశ్యాలను చూడటానికి పర్యటన చేస్తారు. ఇలా ప్రజలు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వెళ్లడమే టూరిజం. ఇది విభిన్న సంస్కృతులను అనుభవించడానికి, కొత్త విషయాలను తెలుసుకోవడానికి సహాయపడుతుంది.

పర్యాటక రంగ పరిశ్రమ నేడు ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక రంగాలలో ఒకటిగా పరిగణిస్తున్నారు. గడచిన కొన్ని సంవత్సరాలుగా పర్యాటక రంగ పరిశ్రమ విస్తరించింది. మన దేశానికి కూడా గత కొన్ని దశాబ్దాలలో అంతర్జాతీయ పర్యాటకుల రాక గణనీయంగా పెరిగింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం ట్రావెల్ అండ్ టూరిజం డెవలప్‌మెంట్ ఇండెక్స్ 2024 విడుదల చేయగా, దక్షిణాసియాలో భారతదేశం పర్యాటక రంగంలో 39వ స్థానంలో ఉంది.

## భారతదేశంలో పర్యాటకం

భారతదేశంలో చారిత్రక వారసత్వ సంపద ఎంతో ఉంది. నదీ తీరాలు, సహజ జలపాతాలు, అరణ్యాలు, చారిత్రక కోటలు, బౌద్ధ, జైన, హిందూ వారసత్వ కట్టడాలు, సంస్థానాలు, పురాతన ఆలయాలు, పుణ్యక్షేత్రాలు ఇలా చూడదగినవి ఎన్నో ఉన్నాయి. గ్రామీణ, గిరిజన సంస్కృతి, జానపద కళారూపాలు, హస్తకళలు, మొదలైన ఎన్నో అంశాలు ఇక్కడి ప్రాంతం కలిగి ఉంది. మతపరమైన పర్యాటకం, హెరిటేజ్ పర్యాటకం, జలపాత పర్యాటకం, వన్యప్రాణులు పర్యాటకం గిరిజన పర్యాటకం, సాంస్కృతిక పర్యాటకం మొదలైనవి పర్యాటకంలో వివిధ రకాలు.

**తెలంగాణలో:** భారతదేశ పర్యాటక అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక రంగం గణనీయమైన పాత్రను పోషిస్తోంది. ప్రత్యేకించి హైదరాబాద్ నగరం జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను అత్యంత విస్తృతంగా ఆకర్షిస్తోంది. తెలంగాణ దాని గొప్ప సంస్కృతి, వంటకాలు మరెన్నో అంశాలు కలిగి తెలంగాణ టూరిజం భారతీయ పర్యాటకాన్ని సామాజిక ప్రయోజనాలతో పాటు ఆర్థిక ప్రయోజనాలను ప్రభావితం చేస్తుంది. హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రం రాజధాని. ఇది తెలుగు చలనచిత్ర పరిశ్రమకు నిలయంగా ఉంది. ఈ నగరంలో ఉన్న అనేక కట్టడాలు, మ్యూజియం పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.

**ఆంధ్రప్రదేశ్ లో:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ కృషి చేస్తోంది. ఇది పర్యాటకులకు హోటళ్లు, రిసార్టులు, బస్సులు లాంటి పర్యటన సౌకర్యాలు అందచేస్తున్నది. దీనితోబాటు సమాచార, రిజర్వేషన్ కేంద్రాలు, పడవ ప్రయాణ సేవలను కూడా అందచేస్తున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గొప్ప చారిత్రక, సహజ నేపథ్యాన్ని సూచించే వారసత్వ సంపదను



కలిగి ఉంది. తిరుపతి, అరకు, విశాఖపట్నం, శ్రీశైలం వంటి ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ రిసార్టులను నిర్వహిస్తోంది. బంగాళాఖాతం తీర ప్రాంతంతో పాటు తూర్పు కనుమలు కలిగి ఉండటం ఆంధ్రప్రదేశ్ టూరిజానికి అదనపు ఆకర్షణ అని చెప్పవచ్చు.

## మౌలిక సదుపాయాల కల్పన

దేశీయ పర్యాటకుల రాకపోకల్లో భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతంలో తెలంగాణ ఏడవ స్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ మూడవ స్థానంలో ఉంది. ముఖ్యమైన పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడం ద్వారా, వాటిని విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా మరింత మంది పర్యాటకులను ఆకర్షించడానికి అవకాశం ఉంటుంది. తెలంగాణకు ప్రాంతం వేల సంవత్సరాల సాంస్కృతిక చరిత్ర కలిగి ఉంది.

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికి వచ్చే చాలామంది పర్యాటకులు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మరికొన్ని ప్రాంతాలకే పరిమితం అయ్యారు. కాబట్టి రాష్ట్రంలో ఉన్న ముఖ్యమైన, చూడదగిన ప్రదేశాలను మరింత అభివృద్ధి చేసి పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలి. తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌకర్యవంతమైన ప్రపంచ స్థాయి వసతులు కల్పిస్తూ రాష్ట్రవ్యాప్తంగా హరిత హోటళ్లను, రిసార్ట్స్‌లను అందిస్తుంది.

## ట్రావెల్ ఏజెంట్లు

ఏ రాష్ట్రంలోనైనా పర్యాటక రంగం అభివృద్ధి పర్యాటకుల సౌకర్యాలపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది.



అందువల్ల ప్రాథమిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంలో కేంద్ర ప్రభుత్వం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కీలకపాత్ర పోషించాలి. ట్రావెల్ కంపెనీలు భారతదేశంలోకి విదేశీ పర్యాటకుల ద్వారా తీసుకువచ్చే విదేశీ మారకద్రవ్యం జాతీయ ఆర్థిక వ్యవస్థకు ఒక ముఖ్యమైన సహకారం అని చెప్పవచ్చు. ట్రావెల్ ఏజెంట్లు రవాణా ద్వారా పర్యాటకులను వివిధ ప్రదేశాలకు తిప్పుతూ పర్యాటక రంగ అభివృద్ధికి తోడ్పడుతున్నారు.

## ఆర్థిక వ్యవస్థ బలోపేతం

పర్యాటక రంగం ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. వివిధ దేశాల మధ్య శాంతి, అవగాహనను ప్రోత్సహిస్తుంది. ఇది సామాజిక ఆర్థిక ప్రయోజనాలను కలిగిస్తుంది. సంస్కృతి వైవిధ్యాలను తెలియజేస్తుంది. అంతర్జాతీయ సోదర భావాన్ని పెంపొందిస్తుంది. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ పర్యాటక రంగం. ఆధునిక కాలంలో సామాజిక ఆర్థిక అభివృద్ధిలో పర్యాటకం ఒక ముఖ్యమైన భాగం.

## విద్య, ఉపాధి

ప్రస్తుత అంతర్జాతీయ పర్యాటక పోకడ గ్లోబల్ టూరిజం పురోగతిని మెరుగైన మార్గంలో అర్థం చేసుకోవడానికి విద్యార్థులకు ఉపయోగపడుతుంది. టూరిజం కోర్స్ చదవడం ఎంతో మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ ప్రకారం ప్రపంచం మొత్తం ఉద్యోగాల్లో ఆరు నుండి ఏడు శాతం ప్రత్యక్షంగా, మిలియన్ల మంది పరోక్షంగా పర్యాటకం ఉపాధిని కల్పిస్తోంది. పర్యాటక పరిశ్రమ చిన్న స్థాయి వ్యాపారాలకు కూడా అవకాశాలను కల్పిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని పర్యాటక సంబంధిత కార్యకలాపాలను ప్లాన్ చేయడానికి అభివృద్ధి చేయడానికి, పర్యవేక్షించడానికి పర్యాటక సంస్థలు ఏర్పడ్డాయి. మార్కెటింగ్ చేయడంలో, దేశ పర్యాటక పరిశ్రమ నిర్మాణంలో ఇవి ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.

## ప్రయోజనాలు

పర్యాటకం మంచికోసం ఉపయోగపడే ఒక అదృశ్య శక్తి. ఇది విభిన్న సంస్కృతుల మధ్య అవగాహన, గౌరవాన్ని



పెంపొందిస్తుంది, స్నేహం, సహకార భావనలు నిర్మిస్తుంది. వ్యక్తిగత స్థాయిలో, ఇది మన మనస్సులను తెరుస్తుంది, మన ఊహలను సవాలు చేస్తుంది. జీవితకాలం పాటు ఉండే జ్ఞాపకాలను సృష్టిస్తుంది. ఆధునిక ప్రపంచంలో ఆర్థికంగా ఇది ఆదాయాన్ని తీసుకురావడం, ఉద్యోగాలను సృష్టించడం, స్థానిక వ్యాపారాలకు మద్దతు ఇవ్వడం ద్వారా గణనీయమైన సహకారిగా పనిచేస్తుంది. ఈ ఆర్థిక ప్రోత్సాహం కమ్యూనిటీలు అభివృద్ధి చెందడానికి, వివిధ ప్రాంతాలు అభివృద్ధి చెందడానికి సహాయపడుతుంది.

## సాంస్కృతికంగా పర్యాటకం

ప్రపంచంలోని వివిధ ప్రాంతాల ప్రజలను కలుపుతూ వారధిలా పనిచేస్తుంది. ప్రయాణం ద్వారా ప్రపంచ వైవిధ్యం పట్ల అవగాహన, సహనం, ప్రశంసలను పెంపొందించుకుంటారు. ప్రజల మధ్య అర్థవంతమైన సంబంధాలను సృష్టిస్తుంది. పర్యాటకులను ఆకర్షించే అనేక గమ్యస్థానాలు ప్రకృతి సౌందర్యంతో, చారిత్రక ప్రాముఖ్యంతో సమృద్ధిగా ఉన్నాయి. ఈ సంపదను ప్రాముఖ్యతను గుర్తించి పర్యాటక పరిశ్రమ స్థిరమైన పద్ధతులను ఎక్కువగా అవలంబిస్తోంది. ఈ నిబద్ధత పర్యావరణ పరిరక్షణ, సందర్శించిన ప్రదేశాల సాంస్కృతిక వారసత్వాన్ని నిర్ధారిస్తుంది.

## పర్యాటక రంగం

ఆర్థిక వృద్ధికి, సాంస్కృతిక అవగాహనకు, పర్యావరణ పరిరక్షణకు గణనీయంగా దోహదపడుతుంది. దాని బహుముఖ ప్రభావం ప్రపంచ దేశాల మధ్య పరస్పర అనుసంధానాన్ని, వైవిధ్యాన్ని నిలబెట్టుకోవడంలో మన బాధ్యతను గురించి తెలియజేస్తుంది. ఈ రంగం ద్వారా పెట్టుబడులు, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, సుస్థిర గుర్తింపు వంటి ప్రయోజనాలు చేకూరుతాయి.

## పర్యాటక దినోత్సవం

గ్రామీణ ప్రాంతాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలలో సామూహిక పర్యాటకం ప్రతికూల ప్రభావాలతో ముడిపడి ఉంది. అది పర్యావరణంపై ప్రతికూల ప్రభావాలను చూపవచ్చు. కాబట్టి పర్యావరణానికి విఘాతం కలగకుండా తగిన ప్రణాళికతో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలి.

ప్రణాళిక లేని పర్యాటక కార్యకలాపాలు దేశాభివృద్ధికి హాని కలిగించవచ్చు. కనుక పర్యాటకం ప్రాముఖ్యత, సమాజంపై దాని ప్రభావం గురించి అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం సెప్టెంబరు 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం జరుపుకుంటారు. అలాగే భారతదేశంలో జాతీయ పర్యాటక దినోత్సవంను యేటా జనవరి 25న జరుపుకుంటారు. ఇది ప్రయాణ స్ఫూర్తిని తెలియజేస్తుంది. ఈ రోజు ప్రజలను వారి స్వంత దేశాలలో ఉన్న అందమైన ప్రకృతి దృశ్యాలను ఆస్వాదించమని ప్రోత్సహించడమే కాకుండా, అంతర్జాతీయ పర్యాటకాన్ని ప్రోత్సహిస్తుంది. ఒక దేశంలో ఉన్న సాంస్కృతిక, చారిత్రక, సహజ అద్భుతాలను కొనియాడాలని, ఇతర దేశాల భౌగోళిక, సంస్కృతిక అద్భుతాలను గౌరవించాలని జాతీయ పర్యాటక దినోత్సవం తెలియజేస్తుంది.

# చదువు నేర్పిన సంస్కారం



కథ

కొత్తపల్లి ఉదయబాబు

**పెళ్లికొడుకు తల్లి అడిగిన కోరిక విని అప్పటి వరకు అతన్ని ముచ్చటగా చూస్తున్న కావేరి చురుకుగా భర్త మురళీధర్ కేసి చూసింది.**

**అప్రయత్నంగా ఇద్దరి పెదవులమీద చిరునవ్వు మెదిలింది.**

**“సరేనండి. మీరు కోరిన విధంగా జరిపించే పూచీ నాది. కానీ ఒక్క మాట. . పెళ్లయ్యాక మొట్టమొదటిసారి అమ్మాయిని, అల్లుడిని మా పుట్టింటికి తీసుకెళ్లి, మా ఊరి శివాలయంలో స్వామి దర్శనం, మా అమ్మ గారి ఆశీస్సులు తీసుకోవాలన్నది మా ఇంట వస్తున్న ఆచారం.**

ప్రస్తుతం మా అమ్మ గ్రామంలో తమ్ముడి దగ్గర ఉంటోంది. ఆ గ్రామం పట్టణానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంటోంది. పట్నం చేరాక పెళ్ళికొడుకు పెళ్ళికూతురుని మీరు కోరిన విధంగా “గుర్రపు బండి”లో పంపించే ఏర్పాటు చేసి, వెనకాల వాళ్ళని మేం అనుసరిస్తాం.

అటు మా అల్లుడి కోరిక, మా ఆచారం రెండూ తీరినట్టు ఉంటాయి. ఏమంటారు?” అంది కావేరి.

“ఏమంటావురా?” అడిగింది తల్లి పెళ్ళికొడుకుని.

“తప్పకుండా అమ్మా. ఈ హడావుడి ప్రపంచంలో అక్షరాభ్యాసం అయినప్పటి నుంచి అలా.. అలా చదివేసి పోటా పోటీగా ఉద్యోగం ఒకటి సంపాదించేసి ఇరవై ఆరేళ్ళ జీవితంలో గ్రామ సౌందర్యాన్ని, సౌభాగ్యాన్ని ఇప్పటివరకు చూసిందే లేదు. ఇలా చూసే అవకాశం అత్తయ్య, మావయ్య నాకు కల్పించినందుకు వారికి నా ధన్యవాదాలు” అన్నాడు అదిత్.

పెద్దల సమక్షంలో కావేరి, మురళీధర్‌ల ముద్దు బిడ్డ ప్రణతికి, అదిత్‌కి నగరంలో ప్రముఖ కల్యాణ మండటంలో వివాహం అట్టహాసంగా జరిగింది.

మధుపర్కాలలో, మెడలో మెరిసే కృత్రిమ దారాలు చుట్టిన దండలు (చమ్కీదండలు), గులాబీ దండలతో, అందరి దృష్టి వారిమీదే పడేలా అత్యంత ఆకర్షణీయంగా ఉంది నూతన వధూవరుల జంట.

హైదరాబాద్ నుంచి పట్నం చేరుకున్న తరువాత గ్రామానికి వెళ్ళే కూడలిలో వాళ్ళు ప్రయాణిస్తున్న వాహనాలు అన్ని ఆగాయి. మురళీధర్, కావేరి వాహనం నుంచి దిగారు.

వాళ్ళని చూస్తూనే గుర్రపుబండి “సాయిలు” వినయంగా నమస్కరించాడు.

“ఏం సాయిలూ బాగున్నావా? బండి భలే సిద్ధం చేసేశావే“ అంది.

ఆ కూడలిలో ఒక పక్కగా నిలబెట్టబడిన “గుర్రపు బండి” శ్వేతవర్ణంతో తెల్లగా మెరిసిపోతూ, జీను కట్టబడిన జవనాశ్వం ఠీవిగా నిలబడి ఉంది. చామంతి పువ్వుల దండలతో, మామిడి తోరణాలతో అలంకరించబడిన గుర్రపు బండి చూడడానికి ఎంతో అందంగా ఉంది..

“తమ దయవల్ల బాగున్నాను తల్లీ. ఓపిక తగ్గిపోనాది. పైగా ఈ రోజుల్లో గుర్రపు బండి ప్రయాణాలు సేసేవోల్లు తగ్గిపోనారు. మా ఇంట మా పిల్లలతో పుట్టి పెరిగింది కాబట్టి నేను ఉన్నంతవరకు దానిని సాకమని పిల్లల్ని కోరాను. ఆల్లూ ఒప్పుకున్నారు.

మా బంగారు తల్లి మీరు కోరడం, నేను సేయకపోవడమా తల్లీ?... నిన్ను ఎత్తుకు పెంచిన ఆ రోజులు ఎట్టా మరిసిపోగల్ను తల్లి?” బండికి కట్టిన యవ్వనంలో ఉన్న గుర్రానికి జూలు నిమురుతూ అన్నాడు సాయిలు.

సాయిలుకు కూతుర్ని, అల్లుడిని పరిచయం చేసింది కావేరి.

“సల్లంగా ఉండండి బాబు’ అని ఆశీర్వదించాడు సాయిలు.

అతను చెప్పిన విధంగా ప్రణతి నడుము పట్టుకుని జాగ్రత్తగా గుర్రపు బండిలో మెత్తగా అమర్చిన పరుపు మీద కూర్చోబెట్టాడు అదిత్. ఆ తరువాత తాను చక్రంపై కాలు వేసి గూడు లోపలికి చేరాడు అదిత్.

“ఇబ్బంది లేకుండా కూకున్నారా బాబు? ఇక బయల్దేరుదామా?“అడిగాడు సాయిలు.

“ఓ...“అన్నాడు సంతోషంగా అదిత్.

గుర్రపు బండి బయలుదేరి పట్టణం దాటి సన్నటి తారు రోడ్డుమీద ప్రయాణించసాగింది.

21:21.qxd 1/11/2025 3:56 PM Page 1

ఆ పక్కన, ఈ పక్కన కనుచూపు మేరలో ఆకాశం కురిసిన ఆకుపచ్చ వర్ణంలా ఏపుగా పెరిగిన వరి చేలు మెరిసిపోతూ ఉంటే వాటి నుంచి వచ్చే పైరగాలి మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తోంది.

గాలికి చెదురుతున్న ముంగురులు, ఒకళ్ళనొకళ్ళు తమకంగా చూసుకుంటున్న ఆ నూతన దంపతుల చూపుల ఏకాగ్రతని అల్లరి పెడుతున్నాయి.

యవ్వనంలో ఉన్న గుఱ్రం చక చకా పరిగెడుతోంది. దారిలో పోతున్న మనుషులు పక్కకు తప్పుకునే విధంగా సాయిలు వేగంగా పరిగెడుతున్న గుఱ్రపు చక్రంలోకి చర్నాకోలకు ఉన్న వెదురు కఱ్రను పోనిచ్చి టక టక శబ్దం చేస్తున్నాడు.

ఆ శబ్దానికి మనుషులు ప్రక్కకు జరిగి దారి ఇస్తున్నారు. అక్కడక్కడా గత రోడ్ల వలన గుఱ్రపుబండి చక్రాలు గోతుల్లో పడినప్పుడు అలవాటు లేని ప్రయాణం కావడం వల్ల ఒకరి నొకరు పట్టుకుని ఆ కుదుపులకు తట్టుకుంటూ పరవశంతో ఆ అనుభూతుల్ని మనసులో ముద్రించుకుంటున్నారు ఆ నూతన దంపతులు.

వారిని అనుసరిస్తూ వాహనంలో ప్రయాణం చేస్తున్న కావేరికి తన బాల్యం గుర్తొచ్చింది.

ఆమె తండ్రి రాజారావు వంశంలో మూడు తరాల తరువాత పుట్టిన ఏకైక ఆడపిల్ల కావేరి.

రాజారావు భార్య స్వయంగా ఆ ఊరి కరణం అయిన అతని మేనమామ కూతురే. ఆమె అన్న కొడుకే మురళీధర్, రాజా రావు ఎక్కడికి వెళ్లాలన్నా సాయిలు గుఱ్రబ్బండితో ఉదయం ఆరు గంటలకల్లా సిద్ధంగా ఉండేవాడు. కావేరి పుట్టిన క్షణం నుంచి ఆమెకు పెట్టని గొడుగే అయ్యాడు సాయిలు. ఖాళీ సమయాల్లో ఆమెను భుజాలపై మోస్తూ ఎత్తుకు తిప్పేవాడు, ఆడించేవాడు. బడికి గుఱ్రబ్బండిలో దింపి, పాఠశాల వదిలాకా తీసుకువచ్చేవాడు.

కావేరి ఉన్నత పాఠశాల చదువు కోసం రాజారావు తన కుటుంబాన్ని పట్టణానికి మార్చాడు.

ఆనాడు తండ్రిని ఒక కోరిక కోరింది కావేరి.. సంక్రాంతి పండుగ నాల్గవరోజు ముక్కనుమ రోజున తాను "బొమ్మలకొలువు" పేరంటం పెట్టుకుంటానని, ఆ రోజు సాయిలు "గుఱ్ఱపుబండి"లో గ్రామానికి చేరి శివాలయంలో శివునికి పులిహోర నైవేద్యంగా పెట్టి, ఆ గుళ్ళోని పులిహోరను పేరంటంలో ముత్తయిదువులకు, తన స్నేహితులకు వాయినంతో పాటుగా పంచిపెట్టే అవకాశం కల్పించమని కోరుకుంది.

ఎంతో భక్తి ప్రపత్తులతో ఇష్టంగా చేసేటటువంటి కావేరీ కోరికను ఆమె తండ్రి రాజారావు ఆనాటి నుంచి ఆమెకు వివాహం అయ్యేంతవరకు ప్రతి యేటా కొనసాగిస్తూనే వచ్చాడు.

అయితే మురళీధర్ ఆరవ తరగతి నుంచి భాగ్యనగరంలో తన పిన్ని గారింట్లో ఉండి చదువుకుని వకీలుగా సాధన మొదలు పెట్టాడు.

కళ్ళముందు పుట్టిన కావేరి పద్దెనిమిది వసంతాల కన్యగా దర్శనమిచ్చేసరికి తన మామయ్య రాజారావుకు మనసులో మాట చెప్పి కావేరిని సొంతం చేసేసుకున్నాడు.

పుట్టింటికి వచ్చినప్పుడల్లా పట్నం నుంచి గుఱ్ఱపుబండిలో మాత్రమే ప్రయాణించేది కావేరి.

ప్రయాణం సుఖంగా సాగి నూతన దంపతులు ప్రయాణించిన గుర్రపు బండి గుమ్మంలో ఆగగానే కావేరి తమ్ముడు జనార్ధన్ అతని భార్య నూతన దంపతులకు దిష్టి తీసి లోపలకు తీసుకెళ్ళారు.
కావేరి తల్లి జగదీశ్వరి తనకు నమస్కరించిన నూతన దంపతులను మనస్ఫూర్తిగా ఆశీర్వదించింది.

మళ్లీ కుమార్తె వివాహంలో అల్లుని అనుకోని కోరిక ఇలా తీర్చడం ఆమెకు చాలా సంతృప్తిని మిగిల్చింది.

ప్రయాణం సుఖంగా సాగి నూతన దంపతులు ప్రయాణించిన గుఱ్రపు బండి గుమ్మంలో ఆగగానే కావేరి తమ్ముడు జనార్ధన్, అతని భార్య నూతన దంపతులకు దిష్టి తీసి లోపలకు తీసుకెళ్ళారు.

కావేరి తల్లి జగదీశ్వరి తనకు నమస్కరించిన నూతన దంపతులను మనస్ఫూర్తిగా ఆశీర్వదించింది. ఎక్కడో నగరాల్లో నివసించేటువంటి ఈనాటి ఆధునిక యువత తన ఇంటికి తన ఆశీర్వాదం కోసం రావడం ఆ ముదుసలి తల్లి హృదయానికి ఎంతో ఆనందం అనిపించింది.

స్నానాల అనంతరం నూతన దంపతులతో శివాలయాన్ని దర్శించారు కావేరి దంపతులు. బాల్య మిత్రులు ఎందరో నూతన దంపతులను చూసి ఆశీర్వదించి అభినందనలు తెలియజేశారు.

తాను కోరిన వెంటనే తన అల్లుని కోరిక తీర్చిన సాయిలుకు నూతన దంపతుల చేత బట్టలు పెట్టించి ఇరవై ఐదు వేల రూపాయలు బహుమతిగా ఇప్పించింది కావేరి.

చదువుకున్నామన్న భేషజం ఏమాత్రం లేకుండా తనకు నమస్కరిస్తున్న నూతన దంపతులను చూసి సాయిలు ఆ దంపతులను ఆశీర్వదిస్తూ- ఎంతో జీవితాన్ని చూసిన అనుభవంతో "చదువు నేర్పిన సంస్కారం, సంస్కారం నేర్పిన పెంపకం మనుషుల్ని ఎప్పుడు ఉన్నతులుగా గుర్తింపబడేలా చేస్తాయి. అది మీవల్ల రేపటి తరాలకు అందాలి బాబు" అని మనసులో అనుకున్నాడు. ■

## రచనలకు ఆహ్వానం

*రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం.*

*రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా:*

*ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,*

*లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.*

*sunmagvaartha@gmail.com*

# ఓటే ఆయుధం

డాక్టర్ ఎన్.బి.సుధాకర్ రెడ్డి

**విత్తు ఒకటి వేస్తే చెట్టు (మొక్క) మరొకటి వస్తుందా? అన్నది సామెత. అలాగే బుద్ధికొద్దీ సుఖం, దుక్కి కొద్దీ పంట అంటారు పెద్దలు. దేశం అనుకున్నంతగా అభివృద్ధి చెందలేదు, అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయి అనే యువకులు ఒకసారి ఆలోచించాలి.**

అమెరికా, జపాన్, సింగపూర్ తదితర దేశాల అభివృద్ధిని కీర్తించే విద్యావంతులు అందుకు కారణాలు అన్వేషించాలి. ప్రజాస్వామ్య దేశాలలో ప్రభుత్వాల ఏర్పాటు ప్రజల చేతిలో ఉంటుంది.

రాచరికాల పాలనా కాలంలో యథా రాజా తథా ప్రజా అనేవారు. ప్రజాస్వామ్యంలో యథా ప్రజా తథా రాజా అన్న వాస్తవం గుర్తించాలి. దీనికి ఓటు చక్కని ఆయుధం. ఓట్లు వేసే ప్రజలను బట్టే ప్రభుత్వాలు ఏర్పాటు అవుతుంటాయి. ప్రలోభాలకు లొంగి ఓట్లు వేస్తే ప్రబుద్ధులు రాజ్యమేలుతారు. అయినకాడికి దోచుకుంటారు. గుణసంపన్నులకు ఓట్లు వేసి గెలిపిస్తే సమాజం సుసంపన్నమౌతుంది. మనదేశంలో ఐదేళ్ళకు ఒకసారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికల రోజు ఓటర్లు ఇచ్చే తీర్పు ఐదేళ్ళ భవిష్యత్తుకు కారణం అవుతుంది. కులం, డబ్బు, మతం, మద్యం ఇతర ప్రలోభాలకు లొంగి ఓట్లువేస్తే ఎలా ఉంటుందో ఆలోచించాలి. మన దీపమే కదా అని ముద్దుపెట్టుకుంటే మూతి కాలుతుంది. తాత్కాలిక ప్రయోజనాలకు తలవంచి స్వార్థపర శక్తులకు పట్టం కడితే ఐదేళ్ళు పాట్లు పడాల్సి వస్తుంది. ఉత్తమ నేతలకు అవకాశం కల్పిస్తే అభివృద్ధి పరవళ్ళు తొక్కుతుంది. దేశాన్ని, సామాజిక వ్యవస్థలను విమర్శించేవారు, తాము నిర్వహిస్తున్న పాత్రను గురించి ఆత్మవిమర్శ చేసుకోవాలి. సమాజ ప్రగతిలో భాగస్వాములు కావాలి.

ప్రజాస్వామ్యంలో ఓటు ఒక్కటే ఆయుధం. రాజుల కాలంలోలాగా ఏనుగులు, గుర్రాలు, కత్తులు, కటార్లు ఇతరత్రా అవసరం లేదు. కేవలం గంట, రెండు గంటలు క్యూలో నిలబడి ఓటు వేస్తే చాలు. ఆ వేటు వేసే ముందు పార్టీలు, అభ్యర్థులు వారి ప్రణాళికలు, వాగ్దానాలను నిశితంగా పరిశీలించి సరైన వ్యక్తికి ఓటు వేస్తే చాలు. ఐదేళ్ళు నిశ్చింతగా జీవనం సాగించవచ్చు. డ్రైవింగ్ చాతకాని వ్యక్తిని డ్రైవర్‌గా పెట్టుకుంటే ఎలా ఉంటుందో ఊహిస్తే అర్థం అవుతుంది. పాలనానుభవం లేనివారు, స్వార్థపూరిత శక్తులకు ఓటు వేసి అందలం ఎక్కిస్తే ఐదేళ్ళు అగచాట్లు తప్పవు. అయితే మన దేశంలో చాలమంది ఓటర్లు ఈ వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. ప్రధానంగా విద్యావంతులు యువకులలో కొందరు ఎన్నికల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఓటరుగా తమ పేరు నమోదు చేయించుకోవడానికి కూడా కొందరు ఆసక్తి చూపడం లేదు. ఎన్నికల రోజు ఓటు వేయని వారిలో ఎక్కువగా విద్యావంతులు, ఉన్నత వర్గాలు, యువతీ యువకులు ఉంటున్నారు. కొందరు సినిమాలు, షికార్లకు సమయం కేటాయిస్తారు. మరికొందరు హాయిగా రిలాక్స్ అవుతారు. ఇలాంటి వారిని ప్రశ్నిస్తే- ఏ రాయి అయితేనేమి పళ్ళూడగొట్టుకోడానికి.. అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెపుతారు. మరీ మాట్లాడితే వితండవాదనలు చేస్తారు.



బాధ్యతారహితంగా వ్యవహరించే ఓటర్ల వల్ల కొన్ని సందర్భాలలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోంది. దాంతో ఉమ్మడి లక్ష్యం దెబ్బతింటోంది.

## బాధ్యత వహించాలి

ప్రజాస్వామ్యం పరిపుష్ఠం కావాలంటే ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలి. హక్కుల కోసం తపించే ముందు ఎంత బాధ్యతగా ఉన్నామో ఆత్మ పరిశీలన చేసుకోవాలి. సమాజంలో ఉన్న పౌరులు జవాబుదారీతనంతో వ్యవహరిస్తే పాలన గాడి తప్పదని గుర్తించాలి. న్యాయం, ధర్మం, సమానత్వం, సమ సమాజ నిర్మాణం కోసం ప్రతివారు నడుం బిగించాలి. దీనికి మొదటి మెట్టు ఓటు వేయడం అన్న సత్యం గుర్తించాలి. మన సమాజంలో దాదాపు 70 శాతం మందికి ఓటుహక్కు ఉంటుంది.

మన దేశంలో 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటుహక్కు కల్పిస్తారు. అంతకంటే తక్కువ వయస్సు ఉన్నవారు 30 శాతం మంది ఉంటారని అంచనా. అర్హత కలిగిన ఓటర్లలో 67-70 శాతం మంది మాత్రమే ఓట్లు వేస్తున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 67 శాతం మంది ఓట్లు వేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో 81.86 శాతం ఓట్లు వేయగా తెలంగాణ రాష్ట్రంలో 66.30 శాతం మంది లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేశారు. చాలాచోట్ల, పలు సందర్భాలలో ఓటర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించిన దాఖలాలు ఉన్నాయి.

కొన్ని ఎన్నికల్లో యాభై శాతం కంటే తక్కువ పోలింగ్ జరిగిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సమాజానికి వెన్నెముక లాంటి యువత బాధ్యత తీసుకోవాలి. ఓటుహక్కు నమోదు నుంచి, ఓట్లు సద్వినియోగం వరకు అంకితభావంతో వ్యవహరించాలి.

రాజకీయ పార్టీలు కూడా ఓటర్లను ప్రలోభపరవడం మాని వాళ్లను ప్రభావితం చేయడానికి కృషి చేయాలి. అందరూ కలసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి.

**(జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా..)** ■

# తెలుగు మాటకు గుడి-తిక్కన భారతం

**జయసూర్య**

ఆంధ్ర మహాభారతం నన్నయ, రెండున్నర పర్వాలు రచించి దివంగతుడయిన తర్వాత రెండు వందల యేళ్ల మహాభారతం జోలికి పోయిన కవి లేకపోవటం ఒక చారిత్రక సత్యం, పంచమ వేదమైన భారతాన్ని 'ఆంధ్రావళి మోదముం బొరయునట్లుగ' రచించడానికి సంకల్పించి, వ్యాస మహాకవి సృష్టికి ప్రతిసృష్టి చేసిన కవిబ్రహ్మ తిక్కన, ఉభయకవి మిత్రునిగా ఆంధ్రభాషకే కాదు తెలుగుజాతికి ఆరాధ్యనీయులు.

1250-1263 మధ్య నెల్లూరు రాజ్యాన్ని పరిపాలించిన మనుమసిద్ధికి మంత్రి, దండనాథుడు, ఆస్థాన కవి అయిన తిక్కన తన పాండిత్య వైదుష్యంచే కాకతీయ గణపతిదేవ చక్రవర్తిని మెప్పించి, ఆయన అండదండలతో మనుమసిద్ధిని మళ్లీ నెల్లూరు సింహాసనంపై ప్రతిష్ఠింపచేసిన ఘనకీర్తివంతుడు. భారత రచనా భాగాన్ని, తమ ఇష్టదైవమైన హరిహరనాథునికి అంకితం ఇచ్చాడు. తెలుగుజాతి సంస్కృతి అంతా, తెనుగు భారతంలో ప్రదర్శింపచేసిన మహాకవి. శబ్దం నుండి రూపం సృష్టించి నాటకీయతగా తెలుగు పలుకుల మహార్థాలు భాసింపచేసాడు. మనుమసిద్ధి మంత్రి అయిన తిక్కనామాత్యుడు, 13వ శతాబ్దంలో జీవించి 'ఆంధ్ర సాహిత్య ప్రపంచాన్ని ప్రభావితం చేసిన మహాకవిగా ఖ్యాతిపొందాడు.

తిక్కన చేసినది భారతాంధ్రీకరణం కాదు. భారత నిర్మాణం, నానారస ప్రబంధ పరిపూర్ణ కావ్యాన్ని సృష్టించాడు. తిక్కన కారణజన్ముడు. కాకతీయుల యుగంలో మత రాజకీయ సాహిత్య రంగాలలో ధర్మ సంస్థాపన చేసిన ఆ మహనీయుడు ఎప్పుడు అవతరించాడో, ఎప్పుడు అవతారం చాలించాడో నిర్ణయించే విశ్వసనీయమైన ఆధారాలు లేవు. తిక్కన సోమయాజి కవితావైభవం సజీవమైన తెలుగుభాషతో పరిచయం, తెలుగు భారతాత్మతో సాన్నిహిత్యం, తెలుగు పలుకుబడికి తిక్కన భారతం దేవాలయం. తిక్కన భారతంలోని కొన్ని మంచి పద్యాలతో పరిచయం సంపాదించుకోవడం నిజమైన తెలుగు భాషాభిమానుల కర్తవ్యం. పురాణాన్ని కావ్యంగా, ఆఖ్యాయికను నాటకీయంగా, పాత్రల విస్పష్టతా చిత్రణ, మనస్తత్వ నిశిత విశ్లేషణ సారస్వతాన్ని తిక్కన కొత్త మార్గంలో నడిపించారు.



తిక్కన రాజకీయ చతురుడు, నీతి చాణక్యుడు. అటువంటి నీతినిపుణుడైన మంత్రి తిక్కన, ఒరుగల్లును సందర్శించడం సిద్ధేశ్వర చరిత్రలో అపూర్వ ఘట్టంగా వర్ణింపబడింది. ఒరుగల్లులోని తెలుగు దేశీయాభిమానం చేత ప్రభావితుడైన తిక్కన అచ్చమైన తెలుగు పదాలను, జాతీయాలను, నుడికారాలను ప్రయోగించటంతో తెలుగు కవిత్వంలో దేశీతనంతో కూడిన సంస్కృత మిశ్రితమైన తెలుగుభాషాశైలి ఆవిర్భవించింది. ప్రతాపరుద్రుని శౌర్యం, గణపతిదేవుని రాజనీతి, విశ్వేశ్వర శివదేశికుని ఆధ్యాత్మికత, ఖడ్గతిక్కన సాహసం భారతాంధ్రీకరణలో ప్రతిఫలించాయి.

నన్నయ తెనుగుకు యివ్వని ప్రాధాన్యం, ఆ శైలికి మెఱుగుపెట్టి తెనుగుతనంతో ధర్మార్థ కామమోక్షాల చతుర్విధ ఫలాలను అందించినవాడు తిక్కన. తెనుగుతనం ఉట్టిపడేటట్లు సకల వినీతజ్ఞునిగా శైవ, వైష్ణవ భేదాన్ని పోగొట్టటానికి హరిహరనాథోపాసన ఉపదేశించాడు. స్వేచ్ఛానువాదం, ఆత్మీయ శిల్పకళా చాతుర్యంతో, తిక్కన కాలంనాటికి తెలుగుభాష స్వతంత్రత పొందింది. మూలంలోని ఘట్టాలకు సరిపడే తెలుగు పదాలను ఎత్తుకొని, ముత్యాలకోవగా కూర్చి వ్యాసజ్ఞానమనే స్వర్ణపాత్రలో, తన ప్రతిభాగ్నితో కరిగించి తిక్కన భారతాన్ని తెనిగించినట్టుగా తదనంతర విద్వత్కవులు విశ్లేషించారు. భారతాంధ్రీకరణం ముగ్గురు కవులచే సుమారు 300 సంవత్సరాలలో పూర్తి చేయబడింది. నన్నయ తన రచనను సుమారుగా 1050లో ప్రారంభిస్తే, తిక్కన సుమారు 1250 నాటి వాడయితే, ఎఱ్ఱన 1350 నాటికి భారతాంధ్రీకరణం పూర్తిచేసాడు. నన్నయ భారత రచనా కాలం నాటికి తెనుగు భాష సమర్థవంతం కాలేదు. పదాలు లేవు. వాక్య రచనా పద్ధతి అంతగా పెంపొందలేదు. నాటితెనుగు భాషకు ఒక లక్షణం, ప్రామాణిక మార్గం ఏర్పడలేదు. వాటినన్నింటినీ ఆంధ్ర కవిత్వ విశారదుడు, విద్యాదయితుడు, మహితాత్ముడు అయిన నన్నయభట్టు దక్షతతో సమకూర్చి స్థిరీకరించి భాషా వాఙ్మయాన్ని సృజించారని తిక్కన ప్రశంసించాడు. స్వతంత్రుడయిన కవి, తన కాలంలోని జాతి, నాగరికత, సంప్రదాయాల విశిష్టత, జనజీవన విధానాలు మొ॥ సంస్కారాలను తన స్వయంప్రతిభతో కావ్య స్వరూపాన్ని, నిర్మాణ ప్రక్రియను ఏర్పరచుకోవడం మహాభారత ఆంధ్రీకరణం సూచిస్తోంది. తర్వాత తెలుగుకవులు అనుసరించడానికి నన్నయ వేసిన బాటలో తిక్కన అనుసరించాడు. తిక్కన వైదికమార్గ నిష్ఠమైన వర్తనంలో సోమయాజిగా పంచమవేదమైన భారతాన్ని అఖండ భక్తితత్పరతతో తెనిగించాడు. తెనుగు మాటలలో ఆ విధంగా తిక్కన రచించిన రాజనీతి, రాయబారం వంటి ఘట్టాలు ప్రత్యక్ష అనుభవం వున్న దీక్షాదక్షునిగా తిక్కన మహాకవి దేశీయ రచనగా కొనసాగించాడు.

**"తెనుగు బాస వినిర్మింప**
**దివురుటరయ**
**భవ్య పురుషార్థ తరుపక్వ**
**ఫలముగాదె"**

తిక్కన చేసిన భారతాంధ్రీకరణం తెనుగు భాషను చైతన్యవంతంగా జీవద్భాషగా క్రమేపీ తదనంతర శతాబ్దాలలో రూపుదిద్దుకొనే నవ్యయుగంవైపు ప్రవహింపచేసింది. ఆంధ్రవాఙ్మయం అనంతమైన గోదావరినదీ ప్రవాహం.

# గుప్త దానం

యామిజాల జగదీశ్

ఓ ఊళ్ళో ఒకరున్నారు. ఆయన చాలా మంచివారు. ఎవరికో ఒకరికి ఏదో ఒకటి ఇస్తుండేవారు. ఆయనను అందరూ దాతగా చెప్పుకునేవారు.

రోజూ ఎవరికో ఒకరికి ఏదో ఒకటి ఇవ్వకుంటే ఆయనకు ఆ రోజంతా వృథా అయినట్లు భావించేవారు. అంతేకాదు, ఆయనకు ఆ రోజు రాత్రి నిద్ర పట్టదు. ఆయన మనసు ఆయనను సతాయిస్తుంటుంది.

ఇక్కడో విషయం చెప్పుకోవాలి. ఆయన ఇచ్చేది మూడో వ్యక్తికి తెలీదు, తెలియనివ్వరు. అంటే అంత గట్టుచప్పుడు కాకుండా ఇస్తారన్నమాట. కుడి చేయి ఇచ్చేది ఎడమ చేతికి తెలీదనే మాటకు ఆయన ప్రతిబింబం. అసలు ఆయనను చూసే ఆ మాట వచ్చిందేమో అని అనుకునేవారు.

ఒకరోజు రాత్రి.... ఆయన అప్పటికే ఓ సంచిలో కొంత డబ్బు పెట్టుకుని బయలుదేరారు. వీధిలో అడుగులు వేస్తున్నారు.



ఈరోజు ఎవరికి ఈ డబ్బు సంచి ఇవ్వాలా? అని ఆలోచిస్తూ అడుగులు వేస్తున్నారు. అంతలో ఓ వ్యక్తి ఎదురుగా వస్తూ కనిపించారు. వెంటనే ఆయన వద్దకు వెళ్లి తన దగ్గరున్న డబ్బు సంచిని ఆ మనిషి చేతిలో పెట్టి వెనక్కు తిరిగొచ్చేసారు ఈ పెద్దమనిషి.

హమ్మయ్య... ఈరోజు ఎలాగోలా ఒకరికి ఇవ్వాలనుకున్నది ఇచ్చేసాను. ఎవరూ చూడలేదనుకున్నారు. తృప్తితో ఆయన ముఖం విప్పారింది. ఆ రోజు రాత్రి ఆదమరిచి నిద్రపోయారు.

మరుసటి రోజు పొద్దున్నే ఊరు ఊరంతా ఒకటే మాట. నిన్న రాత్రి ఓ దొంగ చేతిలో ఎవరో ఓ డబ్బు సంచిని ఉంచి వెళ్ళిపోయారట! అన్నదే ఆ మాట. ఆ మాట తన వరకూ రావడంతో అతడు చాలా బాధ పడ్డారు.

అరెరె! దొంగకు నేను సాయం చేసానని లోలోపల బాధ పడ్డారు. తాను ఇచ్చిన డబ్బులు వృథా అయ్యాయని విచారించారు. సరే. జరిగిపోయిందేదో జరిగిపోయింది. ఈరోజు మరెవరికైనా ఇవ్వాలి అని నిర్ణయించుకున్నారు. రాత్రి అయింది. ఎప్పట్లాగే ఆరోజు కూడా ఆయన వీధిలోకొచ్చారు. నెమ్మదిగా అడుగులు వేస్తున్నారు. చేతిలో డబ్బు సంచి.

ఎదురుగా ఓ స్త్రీ రావడం కనిపించింది. ఆమె ఎవరో స్పష్టంగా తెలీలేదు. ఆమె ఎవరైతేనేం అనుకుని ఆమె వద్దకు వెళ్ళి చేతిలో డబ్బు సంచి పెట్టి వెనుతిరిగారు.

మరుసటి రోజు మళ్ళీ ఊరంతా ఒకటే మాట. నిన్న రాత్రి ఒకాయన అక్రమమైన స్త్రీకి డబ్బులు ఇచ్చి వెళ్ళిపోయారని అందరూ అనుకున్నారు. ఈ మాట కూడా ఆయన చెవిదాకా వచ్చింది. ఈరోజు కూడా నేను ఇచ్చింది వృథా అయ్యిందనుకుని బాధపడ్డారాయన. ఇప్పుడనుకుని ఏం లాభం... ఈ రోజైనా ఎవరికో ఒకరికి డబ్బులు ఇవ్వాలనుకున్నారు.

మూడో రోజు రాత్రి ఆయన డబ్బు సంచితో బయలుదేరారు. ఎదురుగా వచ్చిన ఒకరికి డబ్బు సంచి ఇచ్చి వెనుతిరిగారు. మరుసటి రోజు అందరూ మాట్లాడుకున్నారు. ఓ ధనవంతుడికి ఓ అజ్ఞాత వ్యక్తి డబ్బు సంచి ఇచ్చారని చెవులు కొరుక్కున్నారు. ఈరోజూ ఆయన ఆ మాటతో బాధపడ్డారు.

మూడు రోజులూ తాననుకున్నట్టు సరైన వారికి ఇవ్వలేకపోయానే అని బాధపడుతూ పడుకున్నారు. ఆరోజు రాత్రి ఆయనకు ఓ కల వచ్చింది. ఆ కలలో దేవుడు కనిపించి–

“నువ్వు చేస్తున్న దానధర్మాలు వృథా పోలేదు. నీ దగ్గర డబ్బులు అందుకున్న ఆ దొంగ మారిపోయాడు. నీ దగ్గర డబ్బులు అందుకున్న ఆ అక్రమ స్త్రీ కూడా మారిపోయింది. ఇక ధనవంతుడిలోనూ మార్పు వచ్చింది. అప్పటివరకూ పిసినారిలా ఉండిన ఆ ధనవంతుడిలో దానగుణం మొదలైంది. కనుక నీ డబ్బులేవీ వృథా పోలేదు. నువ్వేమీ బాధపడక్కర్లేదు. హాయిగా ఉండు” అని చెప్పి దేవుడు అదృశ్యమయ్యాడు.

ఈ కథ చెప్పింది ఓ సాధువు. ఇందులోని దాగి ఉన్న అంశం ఏమిటంటే, మంచి మనసుతో చేసే ధర్మం/దానం కానీ ఎప్పుడూ వృథా పోదు. అది తనను మాత్రమే కాకుండా పుచ్చుకున్న వ్యక్తిలోనూ మంచి మార్పు తీసుకువస్తుంది. ఈ విషయాన్నే మనం అర్థం చేసుకోవాలి.

ఈ కాలంలోనూ ఇటువంటి కొన్ని సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

అనగనగా ఓ పెద్దాయన. ఆయన చీకట్లో నడుచుకుంటూ వస్తున్నారు. ఎదురుగుండా వస్తున్న ఓ మనిషి ఆ పెద్దాయన చేతులు కట్టిపడేసి ఓ డబ్బు మూట చేతిలో పట్టి వెళ్ళిపోయారు. ఆ పెద్దాయనకు ఆశ్చర్యం.. ఈ కాలంలోనూ ఇటువంటి మనుషులు ఉన్నారా? అని. కుడి చేయి ఇచ్చింది ఎడమ చేతికి తలీదన్నట్లు ఇస్తున్నవారూ ఉన్నారు. ఆ పెద్దాయన తనకు జరిగిన విషయాన్ని ఆలోచించారు. కొంచెం దూరం వెళ్ళి వెనక్కు తిరిగి చూసారు. ఆ మనిషే తిరిగొస్తున్నాడు. ఇచ్చిన డబ్బు సంచిని మళ్లీ తీసుకెళ్లాడు.

పెద్దాయనకు ఏమీ అర్థం కాలేదు ఆయన ఎందుకలా చేసాడని. ఎందుకిలా చేస్తున్నారు? అని అడిగాడు పెద్దాయన.

“అబ్బే ఏమీ లేదు.. కాస్సేపు ఆ సంచి మీ దగ్గర ఉండనీ అని పెట్టి నా పనులు పూర్తి చేసుకొచ్చాను. నన్ను పోలీసులు తరుముకుంటూ వస్తున్నారు. వారు నన్ను పట్టుకున్నప్పుడు నా చేతిలో డబ్బు మూట ఉంటే పోలీసులు ఊరుకుంటారా? ఇప్పుడు నాకు ఏ భయమూ లేదు” అంటూ ఆయన తన దారిన పోయాడు.



**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**


**డా॥ దంతూరి పండరినాథ్**

సెల్: 9885446501/9885449458


# దక్షిణ నైరుతి వీధి పోటు అంటే?

నైరుతి వీధి పోట్ల గురించి చెప్పుకునే ముందు నైరుతి భాగం ప్రాముఖ్యత ఏమిటో చెప్పుకోవాలి. పటంలో చూపించిన విధంగా 9+9=81 గదులలో భూమి పైన వాస్తు పురుషుడు అధో ముఖంగా పడి ఉంటాడు. అతని మీద, అతడు తిరిగి లేవకుండా బ్రహ్మ వాక్కు ప్రకారం దేవ, గంధర్వ, యక్ష, కిన్నెర, కింపురుష, రాక్షసులు అందరూ అధిష్ఠించిన ఉంటారు.

పడమర దిక్కు, దక్షిణ దిక్కులు ఎక్కడైతే కలుస్తాయో ఆ మూలన అధిష్ఠించినవాడు ఒక రాక్షసుడు. ఆ రాక్షసుడి పేరు నిర్రుతి. నిర్రుతి అనే రాక్షసుడు అధిష్ఠించిన స్థానం కాబట్టి ఆ స్థానానికి లేదా ఆ మూలకు నైరుతి అని




పేరు వచ్చింది. ఆ మూలన అధిష్ఠించిన ఆ రాక్షసుడి పని ఏమిటి అంటే– తను అధిష్ఠించిన, తన స్థానంలో ఉన్న దేనినైనా సరే ఆయన విడువకుండా పట్టుకుని ఉంటాడు. ఆయన పట్టుకొని ఉండటానికి అక్కడ ఏమీ లేకపోతే... అంటే ఏ బరువులు లేకపోతే, ఊరికే ఉండలేడు కాబట్టి మనకి పనులు పురమాయిస్తూ ఉంటాడు.

అప్పుడు మనకు ఉరుకులు పరుగుల జీవితం మొదలవుతుంది. అది పాజిటివ్ కావచ్చు. నెగటివ్ కూడా కావచ్చు. చాలా సందర్భాలలో నెగటివ్ మాత్రమే అవుతుంది. అందుకే నైరుతి మూలన వాస్తు శాస్త్రంలో చెప్పినట్లు పెద్ద బరువులు పెట్టవలసి ఉంటుంది. అంటే మనం ఏవైతే వస్తువులు మన దగ్గర నిలకడగా ఉండాలనుకుంటామో, ఆ వస్తువులను అక్కడ పెట్టడం వలన అవి ఎక్కువ కాలం అక్కడ ఉంటాయి. "మన దగ్గర ఎక్కువ కాలం ఉండాలి" అనుకునే వస్తువులు ఏమిటి? సాధారణంగా డబ్బు, నగలు, మన ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్స్ మొదలైనవి. అందుల్ల నైరుతి మూలన ఒక బీరువా పెట్టేసి, అందులో డబ్బు, దస్కం, నగలు... ఇట్లాంటివన్నీ దాచుకోవటం వల్ల అవి ఎక్కువ కాలం అక్కడ ఉంటాయి. అంటే వాటిని మనం అమ్మవలసిన అవసరం రాదు. డబ్బు ఉందనుకోండి. దాని అవసరం మనకు ఎప్పుడూ ఉంటుంది. అవసరమైనప్పుడు అక్కడి నుంచి డబ్బులు తీసుకుంటాం, ఖర్చు పెడతాం. మళ్ళీ ఆదాయం వస్తే తీసుకెళ్లి అక్కడే పెడుతూ ఉంటాం. అక్కడ డబ్బు పెట్టడం వల్ల మనకు కలిగే ప్రయోజనం ఏమిటంటే... డబ్బుకు లోటుండదు. అవసరమైనప్పుడు అక్కడికి వెళ్లి డబ్బులు తీసుకోగలుగుతామంటే– మన అవసరానికి మించిన డబ్బు ఎప్పుడూ అక్కడ సిద్ధంగా ఉంటూ ఉంటుందని అర్థం. అసలు డబ్బులు మొత్తం ఖర్చు అయిపోయి ఖాళీగా ఉండేటటువంటి ఉండే దుస్థితి ఎప్పుడూ రాదు. కానీ నైరుతిని అనుకూల విధంగా ఉపయోగించుకోవటం వల్ల మనకు మంచి జరుగుతుంది. డబ్బు నిలవ ఉంటుంది. ఇంటి డాక్యుమెంట్స్ లాంటివి అవి స్థిరంగా ఉంటాయి. అంటే ఆ డాక్యుమెంట్స్ పెట్టి మనం ఎక్కడ డబ్బు తీసుకురావాల్సిన అవసరం రాకపోవచ్చు. వాటిని తీయటానికి రెండవ కారణం... ఆస్తిని అమ్మేసేటప్పుడు ఆ డాక్యుమెంట్స్ తీసుకెళ్లి ఎవరికైతే అమ్ముతామో వాళ్లకి ఇచ్చేస్తాం. ఆ అవసరం రాదు. మనకు అవసరాలు అన్నీ కూడా మనకు వచ్చే ఆదాయంతోగాని ఇంట్లో ఇతరత్రా వచ్చేటటువంటి ఆదాయంతో కానీ మన అవసరాలు తీరుతాయి. అమ్మవలసిన అవసరం రాదు. నగలు ఉన్నాయి. ఏదో ఒక అవసరానికి అమ్మవలసి రావచ్చు. కానీ మనకి అవసరార్థం ఆర్థిక వనరులు ఏర్పడి, వీటిని అమ్మే అవసరం తప్పించ పడుతుంది. కానీ ఆ నగలు అమ్మటానికి కాకుండా ధరించటానికి ఒక్కొక్కసారి తీసుకుంటాం. పెళ్లిళ్లకు, పేరంటాలకు వెళ్లడం, రావడం.. మళ్ళీ ఆ నగలు తీసుకొచ్చి ఆ స్థానంలో పెట్టేస్తూ ఉంటాం. కానీ డబ్బుల అవసరమై నగలు అమ్మవలసిన అటువంటి దుస్థితి మాత్రం రాదు. ఇంకా ఎక్కువ నగలు చేసుకోవటానికి కావలసిన ఆదాయ వనరులు పెరుగుతాయి.

కొన్ని సందర్భాలలో ఒక ఆస్తి కొనేటప్పుడు డబ్బులు అవసరమవుతాయి. ఏదో విధంగా అనుకూలమైన పరిస్థితి ఏర్పడి, నగలు అమ్మకుండా, ప్రాపర్టీస్ అమ్మకుండా కొత్త ఆస్తి కొనుగోలు చేయగలిగే పరిస్థితులు ఏర్పడతాయి. లేదా అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు హాస్పిటల్ ఖర్చులకి డబ్బులు అవసరమవుతాయి. అలాంటి తీవ్రమైన అనారోగ్య సమస్యలు లేదా హాస్పిటల్‌లో చేరవలసినటువంటి తీవ్ర అనారోగ్య సమస్యలు కలిగించే అవకాశాలు తక్కువ. అనారోగ్య సమస్యలు అసలే రావా? అంటే వస్తాయి. కానీ మనం తట్టుకొని నిలబడగలుగుతాం. తీవ్రమైన అనారోగ్య సమస్యలు అంటే మనం ఖతట్టుకోలేనంత అనారోగ్య సమస్యలు, డబ్బును విపరీతంగా ఖర్చు పెట్టవలసి వచ్చేటటువంటి అనారోగ్య సమస్యలు రావని చెప్పటం ముఖ్య ఉద్దేశం.

(మిగతా వచ్చే వారం..)

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

**వాస్తువార్త**

పూర్తి పేరు : ..........................................

పుట్టిన తేది : ..........................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .............

చిరునామా:..........................................



# స్వయంభూ లింగం

# శ్రీ అగస్త్యేశ్వరాలయం

ఇలపావులూరి వెంకటేశ్వర్లు

**మహా పాశుపత బంధ ఆలయాలు లేదా త్రిలింగ క్షేత్రాలలో మొదటిది కొలకలూరులో ఉన్న శ్రీ అగస్తేశ్వర స్వామి ఆలయం. శ్రీ అగస్త్య మహర్షి ప్రతిష్టించారని ప్రతీతి. దక్షిణ భారతదేశం వచ్చిన శ్రీ అగస్త్య మహాముని తన నిత్య పూజల నిమిత్తం ప్రతిష్టించిన లింగం ఇది. అందుకే స్వామిని ఆయన పేరుతోనే పిలుస్తారు.**

తొలి రోజులలో స్వామివారి లింగం మాత్రమే ఉందని అంటారు. అనంతర కాలంలో శ్రీ వీరభద్ర స్వామి, శ్రీ పార్వతీ అమ్మవారి సన్నిధులు, నవగ్రహ మండపం ఏర్పాటు చేయడం జరిగినట్లు తెలుస్తోంది. కైలాసనాథుడు అర్ధనారీశ్వరుడు. కనుకనే గతంలో మహర్షులు లింగాన్ని మాత్రమే ఆరాధించేవారని అర్థం చేసుకోవచ్చు.

ఇక్కడ మొదటి ఆలయాన్ని ఎవరు నిర్మించారు అన్నది స్పష్టంగా తెలియదు. కానీ ప్రస్తుత ఆలయ తొలి రూపం చాళుక్య రాజుల కాలంలో జరిగింది అని తెలుస్తోంది. తూర్పు చాళుక్య వంశానికి చెందిన వీరు బాదామీ చాళుక్య రాజులకు దాయాదులుగా చెబుతారు.

తరువాయి కాలంలో వీరు తమిళనాడుకు చెందిన ప్రముఖ రాజవంశం అయిన చోళులతో వియ్యం చేసుకొన్నారు. వీరిలో ప్రముఖుడు రాజరాజ నరేంద్రుడు. ఈయన కుమారుడు రాజేంద్ర చోళుడు తన మేనమామల తరువాత గంగై కొండ చోళపురం నుండి చోళ రాజ్యాన్ని పాలించాడు. రాజరాజ నరేంద్రుడు నేటి రాజమహేంద్రవరం నిర్మాత. సువిశాల సామ్రాజ్యాన్ని పాలించిన రాజరాజ నరేంద్రుడు మన హిందూ సంస్కృతి నిరంతరం అగ్ర స్థానంలో ఉండటానికి తగిన మార్గం ఆలయాల నిర్మాణం అని తలంచారు. తమ రాజ్యంలో ఏయే గ్రామాలలో ఆలయాలు లేవు అన్న వివరాలు సేకరించి, క్షేత్ర విశేషాలను ఆధారం చేసుకొని పురాతన విగ్రహాలకు నూతన ఆలయాలు, అదేవిధంగా మరికొన్ని చోట్ల కొత్త ఆలయాలను నిర్మించారని శాసనాలు తెలుపుతున్నాయి.

ప్రతి గ్రామంలో ఒక శివాలయం ఒక విష్ణు ఆలయం నిర్మించారు. నాటి సమాజంలో శైవులకు మరియు వైష్ణవులకు మధ్య ఆధిపత్య పోరు ఉండేది. మధ్యలో జైన, బౌద్ధ మతాల ప్రభావం ఉన్నా అది పెద్ద పరిగణలోకి తీసుకోలేదని అర్థం అవుతుంది. నేడు మనకు కృష్ణ, గుంటూరు జిల్లాలలో నదీతీరంలో కనిపించే ఆలయాలలో అధిక శాతం వీరి పాలనలోనే అంటే పదకొండవ శతాబ్దంలో నిర్మించినవే కావడం విశేషం.

శ్రీ అగస్తేశ్వర స్వామి ఆలయం, కొలకలూరు శివాజ్ఞ మేరకు దక్షిణా పథానికి భార్య లోపాముద్ర, శిష్య ప్రశిష్య గణంతో తరలి వచ్చిన అగస్త్య మహర్షి తాను బస చేసిన ప్రతి ప్రదేశంలో ఒక శివ లింగాన్ని ప్రతిష్టించారని చెబుతారు.

“ఆది దంపతుల కల్యాణం కనులారా వీక్షించే అవకాశం లేదా?” అని ప్రశ్నించిన అగస్త్య మహర్షికి–

కైలాసవాసుడు “నీవు ఎక్కడ నుండైనా మా వివాహ కార్యక్రమాన్ని చూసేలా వరం ఇస్తున్నాను” అని చెప్పారట. అదేవిధంగా “నీవు ప్రతిష్టించే ప్రతి లింగం స్వయంభూ లింగంగా, నేను స్వయంగా పూజలు అందుకొనేదిగా, భావితరాలకు మనోభీష్టాలను నెరవేర్చేదిగా వర్ధిల్లుతుంది” అని వరం కూడా ప్రసాదించారట లింగరాజు.

ఈ కారణంగా అగస్త్య మహాముని తొలి యుగంలో ప్రతిష్టించిన అన్ని లింగాలు నేటికీ పూజలు అందుకొంటున్నాయి. కొన్ని మహా క్షేత్రాలుగా ప్రసిద్ధికెక్కాయి. మిగిలినవి స్థానిక దేవాలయాలుగా వెలుగొందుతున్నాయి.

అలాంటి వాటిలో శ్రీ అగస్తేశ్వర స్వామిగా మహేశ్వరుడు కొలువైన ఒక క్షేత్రం కొలకలూరు. మహర్షులు తమ ఆశ్రమాలను సహజంగా నదీతీరాలలో నిర్మించుకొనేవారు. ఎందుకంటే అన్ని పూజా విధులకు కావలసిన జలం నిరంతరం లభిస్తుంది కనుక. గతంలో ఈ ఊళ్లో వందకు పైగా కొలనులు ఉండేవట. అందువలన ‘కొలనుల ఊరు’ అని పిలిచేవారట. అదే కాలక్రమంలో “కొలకలూరు”గా మారింది అంటారు.

## ఆలయ చరిత్ర

చాళుక్యులు మొదటి ఆలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. అనంతర కాలంలో ఎన్నో రాజవంశాలు ఈ ఆలయాన్ని సందర్శించారని శాసనాలు తెలుపుతున్నాయి. కాకతీయ పాలకులు ఈ ప్రాంతాన్ని సందర్శించారని తెలుస్తోంది. వారి సేనా శ్రీ సోమయ వెంకం శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని పునఃనిర్మించి ఆలయ నిర్వహణకు ధనం, పొలాలు ఇచ్చినట్లుగా తెలుస్తోంది. అనంతర కాలంలో మానూరి జమీందార్లు ఆలయ నిర్వహణ చేసారని పాళీ భాషలో రాసిన శాసనాల ఆధారంగా తెలియవస్తోంది. అమరావతిని రాజధానిగా చేసుకొని పాలించిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు గారు

కూడా ఆలయానికి మరమ్మత్తులు చేయించి నిధులు సమర్పించారని అంటారు. వీరు ఈ ప్రాంతంలో నూట ఎనిమిదికి పైగా ఆలయాల పునః ప్రతిష్ట లేదా జీర్ణోద్ధరణ చేసారని తెలుస్తోంది.

చోళులు, రెడ్డి రాజులూ, విజయనగర పాలకులు ఈ ప్రాంతాన్ని సందర్శించారని అంటారు. ఇలా ఎందరో మహర్షుల, పాలకుల, అధికారుల, ప్రజల పూజలు అందుకొంటున్న శ్రీ అగస్తేశ్వర స్వామి ఆలయానికి నేటికీ దూర ప్రాంతాల నుండి భక్తులు వస్తుంటారు. ఆలయ విశేషాలు తూర్పు ముఖంగా ఉన్న ఆలయానికి ఎలాంటి రాజగోపురం ఉండదు.

ఆలయానికి వెలుపల ఎత్తైన రథ మండపం, అందులోని రథం ఎంతగానో ఆకట్టుకొంటాయి. చిన్న ద్వారం నుండి లోపలికి ప్రవేశించాలి.

అగస్త్య మహర్షి ప్రతిష్టించిన శ్రీ అగస్తేశ్వర స్వామి ఆలయం సువిశాల ప్రాంగణంలో ఉంటుంది. ప్రాంగణంలో అనేక భిన్న శిల్పాలు, లింగాలు, నందులు కనిపిస్తాయి.

ఇవన్నీ కూడా తొలి ఆలయంలోని భాగాలుగా అర్థం అవుతుంది. అనేక నాగ ప్రతిష్ఠలు కూడా కనిపిస్తాయి. గతంలో అన్ని శివాలయాలలో జాతకరీత్యా ఉన్న సర్ప దోషాలను తొలగించడానికి నాగప్రతిష్ఠలు జరిగేవి అన్న విషయాన్ని తెలుపుతాయి. ఉపాలయాలలో ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి కొలువై ఉండటం దీనిని దృఢపరుస్తోంది.

సువిశాల ప్రాంగణంలోనికి ప్రవేశించగానే ఎదురుగా ఆకాశాన్ని తాకేలా ఉన్న ధ్వజస్థంభం కనిపిస్తుంది. పక్కనే బలి పీఠం, పురాతన నంది విగ్రహాలు ఉంటాయి. ప్రాంగణ ఈశాన్యంలో నవగ్రహ మండపం నాగ శిల్పం కనిపిస్తాయి. ధ్వజస్థంభం వద్ద మనం చెప్పుకొంటున్న త్రిలింగ క్షేత్ర లేదా మహా పాశుపత బంధ ఆలయాల శిలా ఫలకం ఉంటుంది. ప్రదక్షిణా పథంలో చిన్న మండపం దక్షిణ దిక్కున చిన్న చిన్న సమావేశాలు జరుపుకోడానికి నిర్మించారు.

ఆలయ వాయువ్యంలో శ్రీ సుబ్రహ్మణ్య స్వామి సన్నిధి ఉంటుంది. ప్రాంగణంలో మారేడు, పారిజాతం, ఉసిరి, రుద్రాక్ష, శమీ లాంటి దేవ వృక్షాలు కనిపిస్తాయి. విశాల ముఖమండపానికి అనుసంధానంగా పక్క పక్కనే మూడు సన్నిధులు కనిపిస్తాయి. ముఖమండపంలో నందీశ్వరుడు ఉపస్థితుడై ఏకాగ్రచిత్తంతో గర్భాలయంలోని లింగరాజును చూస్తుంటారు.

మూడు సన్నిధులలో దక్షిణం పక్కన ఉన్న మొదటి దానిలో శ్రీ వీరభద్రుడు దర్శనమిస్తారు. కృష్ణాతీరంలో శ్రీ వీరభద్ర, కాలభైరవ ఆరాధన ఎక్కువగా కనిపిస్తుంది.

శాతవాహన రాజులు శైవాన్ని అనుసరించేవారు. ఆ కాలంలో వీరశైవానికి విశేష ఆదరణ ఉండేది. శాతవాహన రాజులతో పాటు ఈ ప్రాంతానికి తరలి వచ్చిన వీర శైవులు ఇక్కడి ఆలయాలలో తమ పూజా విధానాలను, శ్రీ వీరభద్ర, శ్రీ కాలభైరవ విగ్రహ స్థాపన, ఉపాసన ప్రవేశపెట్టారు అని తెలుస్తోంది. ఈ చుట్టుపక్కల అనేక ఆలయాలలో శ్రీ వీరభద్ర, శ్రీ కాలభైరవ సన్నిధులు కనపడటానికి ముఖ్య కారణం ఇదేనని అంటారు. ఉత్తరం పక్కన ఉన్న సన్నిధిలో శ్రీ పార్వతీ దేవి సర్వాంగ సుందరమైన అలంకరణలో ద్విభుజిగా ఒక చేతిలో పుష్పాన్ని ధరించి స్థానక భంగిమలో దర్శనమిస్తారు.



శ్రీ వీరభద్రుని మాదిరే అమ్మవారు కూడా అనంతర కాలంలో ఇక్కడ ప్రతిష్ఠిత మూర్తిగా కొలువు తీరారని చెబుతారు. మధ్యలో ఉన్న ఎత్తైన గర్భాలయంలో ఎత్తైన పానవట్టం మీద విభూతి లేపనం, కుంకుమ చందన నామాలతో నయనమనోహరంగా దర్శనమిస్తారు శ్రీ అగస్తేశ్వర స్వామి. చాలా ఆకర్షణీయంగా చూడగానే చూపుతిప్పుకోలేని విధంగా కనిపిస్తారు స్వామి. స్వామివారికి నిత్య పూజలతో పాటు నియమంగా నిర్ణయించిన సమయంలో అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు ప్రతిరోజూ జరుపుతారు. శ్రీ గణేశ చవితి, శ్రీ సుబ్రహ్మణ్య షష్టి, శ్రీదేవీ నవరాత్రులు, కార్తిక మాస పూజలు, మహా శివరాత్రి ఉత్సవాలు, రథోత్సవం మొదలైన పర్వదినాలు రంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

మహా పాశుపత బంధ ఆలయాలు లేక త్రిలింగ క్షేత్రాలు నాలుగు, విజయవాడ ఇంద్రకీలాద్రి పాదాల వద్ద ఉన్న శ్రీ విజయేశ్వర స్వామి ఆలయాన్ని ఒకే సోమవారంనాడు సందర్శిస్తే ఇహలోక మనోభీష్టాలు నెరవేరతాయి అన్న విశ్వాసంతో ఎందరో భక్తులు ఈ త్రిలింగ క్షేత్ర యాత్ర సోమవారాలు కొలకలూరు శ్రీ అగస్తేశ్వర స్వామి ఆలయం నుండి ప్రారంభిస్తారు.

ఉదయం ఆరు నుండి మధ్యాహ్నం పన్నెండు వరకు; తిరిగి సాయంత్రం అయిదు గంటల నుండి రాత్రి ఎనిమిది వరకు భక్తుల సందర్శనార్ధం ఈ ఆలయం తెరిచి ఉంటుంది.

గ్రామంలో పురాతన శ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి, నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. వీటిని సైతం దర్శించడం అభిలషణీయం.

## ఎలా వెళ్లాలి?

గుంటూరు నుండి వయా నందివెలుగు మీదగా తెనాలి వెళ్లే బస్సులు కొలకలూరులో ఆగుతాయి. కానీ విజయవాడలోని శ్రీ విజయేశ్వర స్వామి ఆలయాన్ని కూడా మధ్యాహ్నం లోపల సందర్శించుకోవాలి. అంటే స్వంత వాహనంలో వెళ్లడం మంచిది. దూర ప్రాంతాల నుండి వచ్చేవారు గుంటూరు లేదా విజయవాడలో ఉండి మహా పాశుపత బంధ ఆలయాల యాత్ర చేయడం ఉత్తమం.

షేక్ అబ్దుల్ హాకీం జాని

# రాజ భోగాల రైలు



భారతదేశంలోని తొలి విలాసవంతమైన రైలుగా ఖ్యాతినార్జించిన ట్రైన్ ప్యాలెస్ ఆన్ వీల్స్. చక్రాలపై పరుగులు తీసే రాజసౌధంలో ప్రయాణం స్వర్గ సౌఖ్యాలు చవిచూచిన అనుభూతి కలగక మానదు. ఈ ప్రత్యేక రైలును రాజస్థాన్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, భారతీయ రైల్వేల సహకారంతో విలాసవంతమైన పర్యటనకు శ్రీకారం చుట్టారు. భారతదేశంలోని అత్యుత్తమ విలాసవంతమైన రైళ్లల్లో ఇది ఒకటి. కోటలు నిర్మించుకోవడం ధనవంతులకే సాధ్యపడుతుంది. కోటికి పడగెత్తక పోయినప్పటికీ లక్షలు గడిస్తే చాలు అటువంటి కలలు సాకారం చేసుకునే మార్గం ఉంది. అదే ప్యాలెస్ ఆన్ వీల్స్, ఇందులో ప్రవేశించిన వారికి మహారాజా, రాణి వారికి ఎలాంటి సేవలు అందుతాయో అవన్నీ లక్షలున్న ప్రతి వ్యక్తి కూడా పొందొచ్చు. రాచరిక మర్యాదలతో పాటు కోరుకున్న ఆహార పానీయాలు, డ్రింక్స్, హంసతూలికా తల్పాలు, వ్యక్తిగత సహాయకులు ఇత్యాది అనేక సౌకర్యాలన్నీ ఈ రైలులో అందుబాటులో ఉంటాయి. తలపాగలు ధరించి రాజస్థానీ సంప్రదాయంలో, బాజా బజంత్రీలు, పూలమాలలతో ప్రయాణికులకు స్వాగతం పల్కుతారు.

రాజస్థాన్లో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు భారతీయ రైల్వే ప్రారంభించిన ప్యాలెస్ ఆన్ వీల్స్ ఇప్పటికీ అగ్రస్థానంలో ఉంది. ఈ రైలులో ఆరు రాత్రులు, వారం రోజులు పగలు ప్రయాణం చేయొచ్చు. ఈ పర్యటనను గోల్డెన్ ట్రయాంగిల్ టూర్ అంటారు. ఈ లగ్జరీ రైలులో రాజస్థాన్తో పాటు ఉత్తరప్రదేశ్‌లోని పలు నగరాలను వారం రోజుల్లో సందర్శించవచ్చు. ఈ రైలులోని రెండు రెస్టారెంట్లలో భారతీయ ఆహారంతో పాటు రాజస్థానీ, మొఘలాయ్, చైనీస్, థాయ్, మెక్సికన్ వంటకాలు అందుబాటులో ఉంటాయి.



**మొదటి రోజు:** ప్యాలెస్ ఆన్ వీల్స్ ఆదివారం ఉదయం 7:30 గంటలకు ఢిల్లీ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 3:30 గంటలకు జైపూర్ చేరుకుంటుంది. మధ్యాహ్నం భోజనం కూడా రైల్లోనే ఏర్పాటు చేస్తారు. ఆ తర్వాత మహారాజా ఎక్స్‌ప్రెస్లోనే డిన్నర్ ఏర్పాట్లు చేస్తారు.

**రెండోరోజు:** రెండో రోజు జైపూర్ సిటీ ప్యాలెస్, సెయింట్ ఆల్బర్ట్ మ్యూజియం, పింక్ ప్యాలెస్, జంతర్ మంతర్, చారిత్రాత్మక అంబర్ ప్యాలెస్ సందర్శన ఉంటుంది.

**మూడోరోజు:** మూడో రోజు రత్నాంబోర్ సిక్రి చేరుకుంటుంది. రణతంబోర్ టైగర్ సఫారీ పార్క్లో వన్య ప్రాణుల సందర్శన, ప్రపంచ వారసత్వ సంపద చిత్తోర్ఘర్ హిల్ ఫోర్ట్ మొదలైనవి సందర్శించవచ్చు.

**నాలుగో రోజు:** ఉదయాన్నే సరోవరాల నగరం ఉదయపూర్ చేరుకుంటారు. అక్కడ సరోవరాల్లో తేలియాడే చారిత్రక మహళ్లు, క్రిస్టల్ గ్యాలరీ, లేక్ పిచోలా, సరోవరాల్లో పడవ ప్రయాణాలు, ఫతేప్రకాష్ ప్యాలెస్ హోటల్లో విలాసవంతమైన భోజనం ఉంటాయి. సాయంత్రం ఉదయపూర్‌లో నగలు, హస్తకళలు, వస్త్రాలు మొదలైనవి షాపింగ్ చేయవచ్చు.

**అయిదవ రోజు:** జైసల్మేర్ చేరుకున్న తరువాత యునెస్కో వారసత్వ ప్రదేశమైన జైసల్మేర్ కోట సందర్శన ఉంటుంది. 15వ శతాబ్దానికి చెందిన ఈ కోటపై సూర్యకాంతి పడగానే బంగారు కాంతులతో మెరుస్తూ కనిపిస్తుంది. ఈ ప్రాంతంలో అనేక హవేలీలు ఉన్నాయి. రాజస్థానీ సంప్రదాయ జానపద ప్రదర్శనలు పర్యాటకుల్ని అలరిస్తాయి. రాత్రి అయిదు నక్షత్రాల హోటల్లో విలాసవంతమైన విందు ఉంటుంది.

**ఆరవరోజు:** ఉదయం జోద్‌పూర్ చేరుకుంటారు. అల్పాహారం ముగిసిన తరువాత 16వ శతాబ్దపు అద్భుతమైన గ్రాండ్ మెహ్రాన్‌గడ్ కోటకు పర్యాటక బృందాన్ని తీసుకెళ్తారు. అక్కడ మ్యూజియంలో రాజులు యుద్ధాలలో ఉపయోగించిన ఖడ్గాలు, వస్త్రాలు మొ॥ చారిత్రక వస్తువులను చూడవచ్చు. రాజసం ఉట్టిపడే హన్వంత్ మహల్ బోటిక్ రెస్టారెంట్లో విందు ఉంటుంది.

**ఏడవ రోజు:** తెల్లవారుఝామున ప్యాలెస్ ఆన్ వీల్స్ పర్యాటక బృందం భరతపూర్ పక్షుల అభయారణ్యానికి చేరుకుంటారు.

ప్రపంచ వారసత్వ ప్రదేశమైన భరత్‌పూర్‌లో శ్రీలంక, సైబీరియా, చైనా, యూరప్, టిబెట్ మొదలైన ప్రాంతాల నుండి వచ్చిన పక్షి జాతులను ఇక్కడ తిలకించవచ్చు. ఏడో రోజు మధ్యాహ్నం నుండి ఆగ్రా చేరుకుని ప్రపంచ వారసత్వ సంపద పాలరాతి కట్టడం తాజ్‌మహల్, ఆగ్రా, ఎర్రకోటను సందర్శిస్తారు. తరువాత మొఘల్ హోటల్లో విలాసవంతమైన విందు ఏర్పాటు చేస్తారు.

**ఎనిమిదవ రోజు:** ప్యాలెస్ ఆన్ వీల్ రైలు ఢిల్లీలోని సఫ్దర్జంగ్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది.



ఇన్ని ప్రత్యేక సౌకర్యాలు ఉన్న లగ్జరీ రైలు టికెట్ ధర కూడా అంతే ఖరీదైనదిగా ఉంటుంది. ఇందులో ప్రయాణించాలంటే ఒక ట్రిప్పు ఒక వ్యక్తికి వారు ఎంచుకున్న క్యాబిన్‌ను బట్టి ఒక లక్ష నుండి ఆరు లక్షల రూపాయల వరకు ఉంటుంది. సౌకర్యాలను బట్టి ఇంకా అధిక ధర గల ప్యాకేజీలు సైతం ఉన్నాయి. ఎనిమిది రోజుల ప్రయాణంతో పాటు పర్యటించే నగరాలు, పర్యాటక ప్రదేశాలు, కల్పించే సౌకర్యాలు ఇత్యాది వాటిని పరిగణించుకుని రైలు టిక్కెట్లు ధరలో మార్పులు ఉంటాయి. నిర్ణయించిన ప్యాకేజ్ చెల్లిస్తే చాలు.. ప్యాలెస్ ఆన్ వీల్స్ రైలును ఎక్కిన దగ్గర నుండి వారం మొత్తం పర్యాటక ప్రదేశాలు తిలకించి, తిరిగి గమ్యస్థానం చేరేవరకు ప్రతి ప్రయాణికుడు రాజభోగాలను అందుకుంటాడు.

ప్యాలెస్ ఆన్ వీల్స్ రైలు సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారికి అందుబాటులో ఉండదు. పైసలున్న బడా బాబులు, విదేశాల నుండి వచ్చే ఖరీదైన పర్యాటకులకు మాత్రమే ప్యాకేజీలు అందుబాటులో ఉంటాయి.

## ప్రయాణ ఖర్చు లక్షల్లోనే!

వాస్తవానికి గుజరాత్, బ్రిటిష్ వైస్రాయ్, హైదరాబాద్‌కు చెందిన నిజాం రాష్ట్రాల పాలకులు కోసం ప్యాలెస్ ఆన్ వీల్స్ ను రూపొందించారు. ఇందులో సౌకర్యాలు పూర్తిగా రాచరిక పద్ధతిలో ఉంటాయి. ప్యాలెస్ ఆన్ వీల్స్ లో ప్రయాణం చేయాలంటే టిక్కెట్టు లక్షల్లోనే ఉంటుంది. ఈ రైలులో ఎక్కువగా విదేశీ అతిథులు రాయల్ జర్నీ కోసం వెళతారు. మన దేశానికి స్వాతంత్ర్యం రావడం కంటే ముందే ఈ రైలు రాజ్పుత్ రాష్ట్రాల పేరుతో 14 కోచ్‌లతో, సెలూన్లు, జిమ్, బార్లు, ప్రత్యేక క్యాబిన్లు, బెడ్‌రూమ్, కిచెన్, డైనింగ్ హాల్, వాల్ టు వాల్ కార్పెంటింగ్, ఖరీదైన దుస్తులతో డిజైనింగ్ అన్నీ అత్యంత ఖరీదైన, సంప్రదాయకంగా అందరినీ అబ్బురపరిచేలా ఉండేది. అంతేకాదు ప్రతీ బోగీలో టివీలు, ప్రత్యేకతతో కూడుకున్న బాత్‌రూములు ఉంటాయి. ప్రయాణికులకు ఏ చిన్న అవసరం వచ్చినా వ్యక్తిగత సహాయకులు అందుబాటులో ఉంటారు.



భారతదేశంలోని అత్యుత్తమ లగ్జరీ రైళ్లలో ఒకటిగా పేరుపొందిన ప్యాలెస్ ఆన్ వీల్స్ అన్ని రకాల ఆధునిక సౌకర్యాలను కలిగి ఉంది. రాజస్థాన్ టూరిజంను ప్రోత్సహించడానికి ఇండియన్ రైల్వేస్ ప్రారంభించిన, ప్యాలెస్ ఆన్ వీల్స్ విలాసవంతమైన ప్రయాణానికి తలమానికంగా! ఉంది.

## ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాల సందర్శన

నేషనల్ జియోగ్రాఫిక్, డిస్కవరీ ఛానెల్ వంటి వివిధ టి.వీ ఛానెళ్లు తమ షోలలో మెచ్చుకున్న ప్రపంచంలోని అత్యంత విలాసవంతమైన పది రైలు ప్రయాణాలలో ఇది ఒకటిగా నిలిచింది. ముఖ్యంగా యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం తాజ్‌మహల్ సందర్శన. ఆగ్రా ఎర్రకోట పర్యటన ఆహ్లాదంగా ఉంటుంది. ఆగ్రా ఎర్రకోట అక్బర్ పాలనలో నిర్మింతమైంది. మొఘల్ రాజవంశంలోని అనేక మంది చక్రవర్తుల నివాసంగా ఇది విరాజిల్లింది. ఆగ్రా కోటలో జరిగే లైట్ అండ్ సౌండ్ షోని పర్యాటకులు ఆస్వాదిస్తారు. ప్యాలెస్ ఆన్ వీల్‌లో ప్రయాణించే పర్యాటకులు వీటిని వీక్షించిన తరువాత రాజస్థాన్ కొనుగోలుదారుల స్వర్గధామానికి చేరుకుని షాపింగ్ చేయవచ్చు. హస్తకళలు, పాదరక్షల నుండి వస్త్రాల వరకు అనేకం అందుబాటులో ఉంటాయి.

రాజస్థాన్‌లోని కొన్ని ప్రసిద్ధ మార్కెట్లు జైపూర్‌లోని త్రిపోలియా, జోహరీ బజార్, జైసల్మేర్లోని సదర్ బజార్, బడా బజార్, బికనేర్‌లోని మహాత్మా గాంధీ రోడ్ మొదలైన అనేక ప్రదేశాలలో విదేశీ పర్యాటకులు మక్కువగా మన దేశ వస్తువులను కొనుగోలు చేసి తీపి గుర్తుగా తమ దేశానికి తీసుకుని వెళుతుంటారు.

రాజస్థాన్లోని తోలుబొమ్మల ప్రదర్శనను ప్రతి ఒక్కరినీ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఇందులో ప్రధాన పాత్రలు రాజులు, రాణులే. పప్పెట్ షో పేరుతో రాజస్థాన్లో ఈ తోలుబొమ్మలాట బాగా ప్రాచుర్యం పొందింది. ఈ తోలుబొమ్మలాట ప్యాలెస్ ఆన్ వీల్స్ పర్యాటకుల హృదయాలను ఉల్లాసభరితం చేస్తుంది. 2017లో ప్యాలెస్ ఆన్ వీల్స్ లో పెనుమార్పులు చేశారు. విలాసవంతమైన క్యాబిన్లతో, రాత్రివేళ ప్రయాణాల కోసం మెరుగైన 39 డీలక్స్, 2 సూపర్ డీలక్స్ క్యాబిన్ల సౌకర్యాలను కల్పించారు.



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795



## మేషం

ఈ వారం వాహనాలు కొనుగోలు అమ్మకాల విషయాలు అనుకూలంగా ఉంటాయి. భూ సంభందిత లావాదేవీలు లాభిస్తాయి. సాఫ్ట్వేర్ రంగంలోని వారికి నూతన అవకాశాలు కలిసి వస్తాయి. సర్పదోషాలు మరియు గ్రహాల వలన కలుగు బాధలు తొలగిపోవడానికి సర్పదోష నివారణ చూర్ణం తో సర్వరక్షా చూర్ణం కలిపి స్నానం చేయండి (తలస్నానం చేయరాదు). సంతాన విద్యా విషయంలో ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తారు. పొదుపు చేసిన ధనాన్ని కొత్త పెట్టుబడులకుగాను పెట్టుబడిగా పెట్టే అవకాశాలు ఉన్నాయి. తనఖాలను విడిపించగలుగుతారు.



## వృషభం

ఈ వారం ప్రతినిత్యం హనుమాన్ చాలీసా పఠించడం వలన మంచి ఫలితాలు ఉంటాయి. వ్యాపారస్థులకు మధ్యస్త ఫలితాలు గోచరిస్తున్నాయి. నూతన అవకాశాలు లభిస్తాయి. కీలకమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు నిష్ణాతుల సలహాలను పరిగణలోనికి తీసుకొనండి. ఐశ్వర్యనాగినిని ఉపయోగించడం వలన లక్ష్మీదేవి అనుగ్రహం, లక్ష్మీ కటాక్షం కలుగుతుంది. అగ్రిమెంట్లు ముఖ్యమైన సంతకాలు చేసేటప్పుడు సాంకేతిక లోపాలు చోటు చేసుకోకుండా జాగ్రత్త పడండి. సినీ, కళా, సాహిత్య రంగాలలోని వారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఒడిఠి పెరుగుతుంది అన్నప్పటికీ ఒకే సమయంలో 2 లేక 3 ప్రాజెక్ట్స్ చేపడతారు .



## మిథునం

ఈ వారం తాత్కాలికంగా ఏర్పడుతున్న అవాంతరాలను పరిగణలోనికి తీసుకొనక పోవడం మంచిది. ఇంట్లో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. వాహన సౌఖ్యం ఏర్పడుతుంది. అదనపు ఆదాయ మార్గాలు లభిస్తాయి. అయితే ఇది తాత్కాలిక మైనవి అయివుంటాయి. ఊహాజనితమైన మాటలతో మిమ్మల్ని నమ్మించడం కష్టతరమని ఇతరులు తెలుసుకోగలుగుతారు. పూజలలో మరియు ఇంట్లో నాగబంధం అనే కుంకుమను ఉపయోగించండి, ఇది ఎంతో విశిష్టమైనది. ఉన్నతాధికారులు మీ శ్రమను గుర్తిస్తారు. తనఖా వస్తువులు విడిపించు కోగలుగుతారు.



## కర్కాటకం

ఈ వారం కోర్టు వ్యవహారాలు వాయిదాలలో ఉంటాయి. నరదృష్టి అధికంగా ఉంటుంది. డ్రైవింగ్లో జాగ్రత్తలు అవసరం. కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా కాలాన్ని గడపగలుగుతారు. రచన ప్రాధాన్యంగా కలిగినటువంటి రంగంలోని వారికి నూతన అవకాశాలు లభిస్తాయి. నానారకాలు అరిష్టాలు, చికాకులు పోవడానికి, శత్రు బాధలు, బాధలు నశించడానికి త్రిశూల్ ని ఉపయోగించండి. ఇది అత్యంత శక్తివంతమైనది. నూతన పరిచయాలు ఏర్పడతాయి, ఉపయుక్తంగా పరిణమిస్తాయి. మంచి చెడులను విడమరచి చెప్పే సన్నిహిత వర్గం ఉంటారు. వృత్తి ఉద్యోగాల పరంగా చెప్పుకోదగిన ఒడిదుడుకులు ఏర్పడవు.



## సింహం

ఈ వారం సెంటిమెంట్ వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు అవసరం. ముఖ్యమైన పనులు సన్నిహితుల సహకారంతో పూర్తి చేస్తారు. ఆలోచనలకు కార్యరూపం ఇస్తారు. నూతన కార్యక్రమాలు చేపడతారు. పూజలలో, శుభకార్యాలలో సుగంధ సిద్ధగంధాక్షింతలను ఉపయోగించండి. గృహం, వాహన అమ్మకాలు కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. సోదరుల నుంచి ధనలాభం పొందుతారు. ఎదుటి వారు మీరు చెప్పేది ఆసాంతం వినకుండా మీ మీద నిందలు వేయడం అసహనానికి గురి చేస్తుంది.



## కన్య

ఈ వారం వ్యక్తిగత విషయములను బయటకు వెల్లడి చేసే వ్యక్తులతో జాగ్రత్తగా ఉండండి. బాధ్యతలు అధికమవడం వలన శ్రమ అధికంగా ఉంటుంది. ఇంట్లోనూ, వ్యాపార ప్రదేశాలలోనూ అష్టమూలికా గుగ్గిలంతో ధూపం వేయండి. ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. వాహనం నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండండి. ఎదుటివారి నిర్లక్ష్యం మనకి ప్రమాదం గా మారవచ్చు. బహుమతులు ఇవ్వాలన్న ఆలోచనలు ముడిబడతాయి..



## తుల

ఈ వారం మోసాలు చేసే వారిని పసిగట్ట గలుగుతారు. కొన్ని సందర్భాలలో ఏమీ మాట్లాడ లేని పరిస్థితులు నెలకొంటాయి. దూరప్రాంత ప్రయాణాలు కలిసి వస్తాయి. ఆపద్ధర్మంగా అబద్ధాలు చెబుతారు. వాహనాన్ని అమ్మి కొత్తది కొనుగోలు చేయాలన్న ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. దీనికి తగిన వ్యక్తులను ఎంచుకుంటారు. వారికి సమాచారాన్ని అందజేస్తారు. దైవదర్శనాలు చేసుకో గలుగుతారు. విహార యాత్రలు పుణ్యక్షేత్రాల సందర్శన చేసుకుంటారు.



## వృశ్చికం

ఈ వారం జీవిత భాగస్వామి సలహాలు, సూచనలు మేరకు కొన్ని నూతన కార్యక్రమాలను ప్రారంభించిన గలుగుతారు. ప్రయోజనకరమైన అంశాలను గ్రహిస్తారు. మహా పాశుపత కంకణం ధరించండి ఉద్యోగ ప్రాప్తి కలుగుతుంది. బంధుమిత్రులతో చర్చలు, సమావేశాలు అంతంత మాత్రంగా ఉంటాయి. మీకు రావాల్సిన టువంటి బాకీలు గురించి గల ప్రస్తావన ఎవరికి నచ్చకపోవచ్చు ఏదో ఒక విషయంతో మాట దాటే వాళ్ళు ఎక్కువగా ఉంటారు.



## ధనస్సు

ఈ వారం కొన్ని కార్యక్రమాల నిమిత్తం మీ పలుకుబడిని పరపతిని ఎంతగానో ఉపయోగిస్తారు చేసే ప్రయత్నాలు సఫలీకృతం అవుతాయి. స్నేహితుల ద్వారా నూతన వ్యాపారాన్ని మొదలుపెడతారు. లిఖితపూర్వకమైన పత్రాల పట్ల ఖచ్చితమైన శ్రద్ధ చూపించండి. మెడలో కాలభైరవ రూపు ధరించండి. వ్యాపారంలో చేసే మార్పులు అనూహ్యంగా కలిసి వస్తాయి. కొద్దిపాటి ఒత్తిడిని కూడా భరించలేని పరిస్థితి ఏర్పడుతుంది.



## మకరం

ఈ వారం కొంతమంది వ్యక్తుల ప్రవర్తన బాధకి భాగోద్వేగాలకి కారణమవుతుంది. స్నేహితుల సహాయము సహ ఉద్యోగుల సహాయము కొంతమేరకు మాత్రమే ఉపయోగపడుతుంది. ఆలోచనలలో మార్పులు ఏర్పడతాయి. కొద్దిపాటి ఒత్తిడిని కూడా భరించలేని పరిస్థితి ఏర్పడుతుంది. లక్ష్మీ తామర వత్తులతో అష్టమూలిక తైలంతో దీపారాధన చేయండి. కీళ్ల నొప్పులు నేత్రవ్యాధులతో అవస్థ పడే అవకాశం ఉంది.



## కుంభం


ఈ వారం శుభకార్యాది విష వ్యవహారాలు ఇంట్లో ప్రస్తావిస్తారు దీనికి తగిన సమాధానాన్ని మీ యొక్క అభిప్రాయాన్ని వెనువెంటనే తెలియజేయవలసిన పరిస్థితి నెలకొంటుంది. కుక్కలకి చపాతీలు తినిపించండి. పక్షులకి నీళ్లని పెట్టండి. అరటి నార వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. వృత్తి రీత్యా కార్యాలయంలో అదనపు బరువు బాధ్యతలు ఏర్పడతాయి. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనారోగ్య సమస్యలు ఏర్పడతాయి.




## మీనం

ఈ వారం కాపురంలో చిచ్చు పెట్టే వారిని గుర్తిస్తారు. వీరి పట్ల మీ ప్రవర్తన మారుతుంది. ఇలాంటి వాళ్ళకి అవకాశం, ఆశ్రయము ఇవ్వకూడదు అని నిర్ణయం తీసుకుంటారు. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి. రుణ బాధల నుండి బయటపడడానికి గాను ఎన్నో విధాలుగా ప్రయత్నాలు చేస్తారు కొన్ని దర్బాలల్లో సందర్భాలలో చేతిలో ఉన్న ఆస్తిని అమ్మి ఈ బాధల నుంచి బయటపడాలని ఆలోచన చేస్తారు.


# ఈ వారం 'కార్టూన్స్'


'కరోనా'కు టీకావేసాక జనాలు దేనికీ భయపడ్డం లేదు బాస్!!


ఏవండీ.. మీ ఫోన్ కాంటాక్ట్స్‌లో
అండీ..!!


యూ ట్యూబ్ లో చూసి ' పాలన ' నే చేస్తున్నాం...
యుద్ధం చేయలేమా? భయపడకు మహారాణీ...!!





పశ్చిమ
బెంగాల్‌లోని కాల్నా
నగరంలో ఉందీ దేవాలయం.
ఇందులో 108 శివాలయాలు వుండటం
విశేషం. గుండ్రంగా వున్న ఈ ఆలయాన్ని
పండుగలు, పర్వదినాల్లో భక్తులు అధిక
సంఖ్యలో దర్శిస్తారు.



